తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
మంగళవారం
25 ఆగస్టు 2026
సంపుటి 03
సంచిక 316
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com

# తాగునీటి భద్రతపై రైల్వేల ప్రత్యేక దృష్టి

- తాగునీటి ట్యాంకులు, ఫిల్టర్ల శుభ్రతకు ప్రత్యేక కార్యక్రమం
- స్టేషన్లలో మౌలిక సదుపాయాల సమగ్ర తనిఖీలకు ఆదేశాలు
- ప్రయాణికులకు నాణ్యమైన తాగునీరు అందించడమే లక్ష్యం




న్యూఢిల్లీ, ఆగస్టు 24 : భారతీయ రైల్వేలు ప్రయాణికులకు సురక్షితమైన, నాణ్యమైన తాగునీరు అందించేందుకు దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించాయి. ఈ కార్యక్రమంలో భాగంగా రైల్వే స్టేషన్లలో ఉన్న తాగునీటి ట్యాంకులు, వాటర్ ఫిల్టర్లను పూర్తిస్థాయిలో శుభ్రపరచడం, క్రిమిసంహారక చర్యలు చేపట్టడం జరుగుతోంది. తాగునీటి నాణ్యతను మరింత మెరుగుపరచేందుకు ఈ చర్యలు కీలకంగా నిలవనున్నాయని రైల్వే శాఖ తెలిపింది. దేశంలోని అన్ని జోనల్ రైల్వేలకు ఈ మేరకు ప్రత్యేక ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రతి స్టేషన్‌లో తాగునీటి సరఫరా వ్యవస్థ, నిల్వ ట్యాంకులు, ఫిల్టరేషన్ యంత్రాలు, పైపులైన్ల పరిస్థితిని సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. ఎక్కడైనా లోపాలు గుర్తిస్తే వాటిని వెంటనే సరిచేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.వర్షాకాల నేపథ్యంలో తాగునీటి కాలుష్య ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. రైల్వే స్టేషన్లలో ప్రతిరోజూ లక్షలాది మంది ప్రయాణికులు తాగునీటిని వినియోగిస్తున్నందున పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రతి స్టేషన్‌కు సంబంధించిన

➤ మిగతా 2వ పేజిలో..



# సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు?

- నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి
- పెండింగ్ భూసేకరణ వేగవంతం
- ప్రాజెక్టుల పూర్తి లక్ష్యంగా చర్యలు
- ప్రజాప్రతినిధులతో సీఎం సమీక్ష



హైదరాబాద్, ఆగస్టు 24 : రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాలు సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రజాప్రతినిధులకు తెలిపారు. బ్రిటన్ పర్యటనను విజయవంతంగా ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో అందుబాటులో ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు,

➤ మిగతా 2వ పేజిలో..

# డీజీపీకి బహిరంగ లేఖ రాసిన ఎంపీ

- తనపై నిఘా పెట్టారంటూ ఆరోపణ
- రాజకీయ జోక్యంపై వివరణ కోరిన అరవింద్
- పోలీసులు చట్టం ప్రకారమే పనిచేయాలన్న డిమాండ్



హైదరాబాద్, ఆగస్టు 24 : నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌కు బహిరంగ లేఖ రాశారు. ఇటీవల తన కదలికలను పర్యవేక్షించేందుకు తెలంగాణ పోలీసు శాఖలో ఏసీపీ స్థాయి అధికారిని నియమించినట్లు సమాచారం అందిందని ఆయన పేర్కొన్నారు. ఈ చర్యలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడి ఆదేశాల మేరకు జరుగుతున్నాయనే సమాచారం తనకు అందిందని లేఖలో ఆరోపించారు. దశాబ్దాలుగా సీవీ ఆనంద్‌ను సమర్థ అధికారిగా తెలుసునని ధర్మపురి అరవింద్ పేర్కొన్నారు. అయితే తనపై నిఘా పెట్టేందుకు ఒక ఉన్నతాధికారిని నియమించారనే

➤ మిగతా 2వ పేజిలో..





# వచ్చే ఎన్నికల్లో ఆలేరు బరిలో తీన్మార్ మల్లన్న

- యువత ప్రశ్నలకు సూటిగా సమాధానాలు
- విద్య, వైద్యానికి 40 శాతం బడ్జెట్ డిమాండ్
- సెప్టెంబర్ 17 నుంచి రాష్ట్రవ్యాప్త పాదయాత్ర
- రిజర్వేషన్లపై స్పష్టమైన అభిప్రాయం

➤ 2వ పేజిలో..

# క్రమశిక్షణ విషయంలో 'నో కంప్రమైజ్'

- ఎవరైనా పార్టీ నియమాలను పాటించాల్సిందే
- పార్టీ నిబంధనలు అందరికీ సమానమే.. ఎవరూ మినహాయింపు కాదు
- పార్టీ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు
- తుది నిర్ణయం క్రమశిక్షణ సంఘానిదే
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 24 (తరంగాలు ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీలో ప్రతి ఒక్కరూ పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉండాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ నిబంధనలు అందరికీ సమానంగా వర్తిస్తాయని, క్రమశిక్షణ విషయంలో ఎవరూ మినహాయింపు కాదని తేల్చిచెప్పారు.రాష్ట్ర మంత్రి కొండా సురేఖకు కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణా సంఘం షోకాజ్ నోటీసు జారీ చేసిన వ్యవహారంపై స్పందించిన సీఎం.. పార్టీ అంతర్గత వ్యవహారాలపై తాను బహిరంగంగా వ్యాఖ్యానించడం

➤ మిగతా 2వ పేజిలో..

# హానర్ హోమ్స్ వ్యవహారంపై ప్రభుత్వ మౌనం ఎందుకు?

- భూముల కేటాయింపులపై సమాధానం చెప్పాలి
- సమగ్ర విచారణ జరపాలని డిమాండ్
- ఐడీఎల్ భూములపై ఈటల రాజేందర్ ప్రశ్నల వర్షం

➤ 2వ పేజిలో..

# డిగ్రీ ఒక్కటే కాదు... నైపుణ్యమే అసలైన బలం

- డిగ్రీతో పాటు నైపుణ్యాలకే డిమాండ్
- మారుతున్న ఉద్యోగ రంగం
- విజయానికి విద్య-స్కిల్స్ సమన్వయం

డెస్క్, ఆగస్టు 24 ఉన్నత విద్య అనేది ప్రతి యువకుడి జీవితంలో కీలకమైన దశ. ఒకప్పుడు మంచి ఉద్యోగం పొందాలంటే డిగ్రీ లేదా పీజీ అర్హతలు ఉంటే సరిపోతుందని భావించేవారు. విద్యాసంస్థల నుంచి పట్టాలు పొందడం ఉద్యోగ జీవితానికి ప్రవేశ పత్రంలా పరిగణించబడేది. కానీ ప్రపంచం వేగంగా మారుతోంది. సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తోంది. పరిశ్రమల అవసరాలు మారుతున్నాయి. ఈ నేపథ్యంలో కేవలం డిగ్రీ ఉంటే సరిపోతుందా? లేక ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలు కూడా ఉండాలా? అనే ప్రశ్న నేటి

➤ మిగతా 2వ పేజిలో..



# కేంద్ర జల, విద్యుత్ పరిశోధన సంస్థ నివేదిక కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు

- కేంద్ర సంస్థ నివేదికకు ప్రాధాన్యం
- కాంగ్రెస్ పై జీవన్ రెడ్డి విమర్శలు
- ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్




హైదరాబాద్, ఆగస్టు 24 కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల అంశం మరోసారి రాజకీయ వేడిని రాజేసింది. కేంద్ర జల,

➤ మిగతా 2వ పేజిలో..

## తాగునీటి భద్రతపై రైల్వేల ప్రత్యేక దృష్టి

లోపాలు, వాటి పరిష్కార చర్యలను ప్రత్యేకంగా నమోదు చేసి పర్యవేక్షించాలని జోనల్ అధికారులకు సూచించారు. స్టేషన్ వారీగా చేపట్టిన చర్యలపై నిరంతర సమీక్ష నిర్వహించి తాగునీటి సదుపాయాలను మెరుగుపర్చేలా చర్యలు తీసుకుంటున్నారు. తాగునీటి ట్యాంకుల శుభ్రపరిచే ప్రక్రియతో పాటు ఫిల్టర్ల పనితీరు, నీటి నాణ్యత పరీక్షలు కూడా నిర్వహించనున్నారు. అవసరమైన చోట్ల పాత పరికరాలను మార్చి కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ప్రయాణికుల ఆరోగ్య భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్లలో తాగునీటి సదుపాయాలను మరింత బలోపేతం చేయడం ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే ఈ ప్రత్యేక కార్యక్రమం లక్ష్యమని రైల్వే శాఖ వెల్లడించింది. శుభ్రత, భద్రత, నాణ్యత అంశాల్లో రాజీ లేకుండా చర్యలు కొనసాగుతాయని తెలిపింది.

## డిగ్రీ ఒక్కటే కాదు... నైపుణ్యమే అసలైన బలం

విద్యా వ్యవస్థ ముందున్న అతిపెద్ద చర్చగా మారింది. సాంప్రదాయ డిగ్రీ విద్యకు ఇప్పటికీ ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. కళాశాలలు, విశ్వవిద్యాలయాలు విద్యార్థులకు ఒక అంశంపై విస్తృత అవగాహన కల్పిస్తాయి. సిద్ధాంతపరమైన జ్ఞానం, పరిశోధనా దృక్పథం, విశ్లేషణ సామర్థ్యం వంటి అంశాలను అభివృద్ధి చేస్తాయి. వైద్యం, న్యాయశాస్త్రం, బోధన, శాస్త్రీయ పరిశోధన వంటి అనేక రంగాల్లో డిగ్రీలు తప్పనిసరి. అందువల్ల డిగ్రీ విద్య విలువ తగ్గిపోయిందని చెప్పడం సరైంది కాదు. అది ఇప్పటికీ విద్యార్థికి బలమైన పునాది అందించే సాధనంగానే కొనసాగుతోంది.

అయితే ప్రస్తుత ఉద్యోగ మార్కెట్ కేవలం విద్యార్హతలను మాత్రమే చూడడం లేదు. ఒక అభ్యర్థి సమస్యలను ఎలా పరిష్కరిస్తాడు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎంత సమర్థంగా ఉపయోగించగలడు, బృందంతో కలిసి పని చేయగలడా, కొత్త పరిస్థితులకు ఎంత త్వరగా అలవాటు పడగలడు వంటి అంశాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. అనేక సంస్థలు ఇప్పుడు మార్కుల కంటే నైపుణ్యాలను ముఖ్యంగా పరిగణిస్తున్నాయి. దీనివల్ల స్కిల్ బేస్డ్ ఎడ్యుకేషన్‌కు డిమాండ్ గణనీయంగా పెరిగింది. నైపుణ్య ఆధారిత విద్య విద్యార్థులను నేరుగా ఉద్యోగ అవసరాలకు అనుసంధానిస్తుంది. కంప్యూటర్ ప్రోగ్రామింగ్, కృత్రిమ మేధస్సు, డిజిటల్ మార్కెటింగ్, గ్రాఫిక్ డిజైన్, డేటా విశ్లేషణ, యంత్రాల నిర్వహణ, సమాచార ప్రసార నైపుణ్యాలు వంటి అనేక రంగాల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తుంది. ఈ కోర్సులు సాధారణంగా ప్రాయోగిక అనుభవానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాయి. ఫలితంగా విద్యార్థులు చదువు పూర్తయ్యే సమయానికే ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలను సంపాదించగలుగుతున్నారు.

భారతదేశంలో ప్రతి సంవత్సరం లక్షలాది మంది యువకులు డిగ్రీలు పూర్తి చేస్తున్నారు. కానీ అందరికీ తగిన ఉద్యోగాలు లభించడం లేదు. దీనికి ప్రధాన కారణాల్లో ఒకటి విద్యా వ్యవస్థ మరియు పరిశ్రమల అవసరాల మధ్య ఉన్న అంతరం. చాలామంది విద్యార్థులు సిద్ధాంతపరంగా మంచి ప్రతిభ కనబరిచినా, ఉద్యోగ రంగంలో అవసరమైన ప్రాయోగిక నైపుణ్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితి విద్యా విధానంలో మార్పుల అవసరాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది. ఇటీవలి కాలంలో అనేక సంస్థలు నియామకాల సమయంలో డిగ్రీ కంటే నైపుణ్య పరీక్షలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. కొన్ని రంగాల్లో డిగ్రీ లేకపోయినా అసాధారణ నైపుణ్యాలు ఉన్నవారికి అవకాశాలు లభిస్తున్నాయి. ముఖ్యంగా సమాచార సాంకేతిక రంగం, సృజనాత్మక పరిశ్రమలు, స్వయం ఉపాధి రంగాల్లో ఇది ఎక్కువగా కనిపిస్తోంది. ఇది యువతలో నైపుణ్యాల ప్రాముఖ్యతపై అవగాహనను పెంచుతోంది.

అయితే డిగ్రీ మరియు నైపుణ్యాలను పరస్పర ప్రత్యామ్నాయాలుగా చూడడం సరైన విధానం కాదు. రెండింటికీ సమాన ప్రాధాన్యం ఉంది. డిగ్రీ ఒక వ్యక్తికి విజ్ఞాన పునాది అందిస్తే, నైపుణ్యాలు ఆ విజ్ఞానాన్ని కార్యరూపంలోకి తీసుకెళ్లే సామర్థ్యాన్ని కల్పిస్తాయి. పునాది బలంగా ఉండి, దానిపై నైపుణ్యాల భవనం నిర్మించినప్పుడే వ్యక్తి పూర్తి స్థాయి వృత్తి నిపుణుడిగా ఎదగగలడు. విద్యాసంస్థలు కూడా కాలానుగుణంగా మారాల్సిన అవసరం ఉంది. సంప్రదాయ బోధనతో పాటు పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన శిక్షణను అందించాలి. ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టులు, ప్రాయోగిక శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు విద్యలో అంతర్భాగంగా మారాలి. విద్యార్థులు కూడా పరీక్షల కోసం మాత్రమే కాకుండా జీవిత నైపుణ్యాల కోసం నేర్చుకునే దృక్పథాన్ని పెంపొందించుకోవాలి.

తల్లిదండ్రులు, విద్యార్థులు, విద్యాసంస్థలు, పరిశ్రమలు కలిసి పనిచేస్తేనే విద్య మరియు ఉపాధి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించవచ్చు. యువతలో సృజనాత్మకత, సమస్య పరిష్కార సామర్థ్యం, నాయకత్వ లక్షణాలు, సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించడం అత్యవసరం. ఇవే భవిష్యత్ ఉద్యోగ మార్కెట్‌లో విజయానికి కీలకంగా మారనున్నాయి. మొత్తంగా చూస్తే ఉద్యోగ అవకాశాల కోసం కేవలం సర్టిఫికెట్ ఒక్కటే సరిపోదు. అలాగే నైపుణ్యాలే చాలు అని కూడా చెప్పలేం. డిగ్రీ అందించే జ్ఞానం, నైపుణ్యాలు అందించే సామర్థ్యం రెండూ కలిసినప్పుడే యువత భవిష్యత్‌ను విజయవంతంగా నిర్మించుకోగలుగుతుంది. అందుకే నేటి విద్యా వ్యవస్థ లక్ష్యం డిగ్రీలను అందించడం మాత్రమే కాకుండా, ఉద్యోగ ప్రపంచంలో నిలదొక్కుకునే నైపుణ్యాలతో కూడిన యువతను తయారు చేయడంగా ఉండాలి.

## కేంద్ర జల, విద్యుత్ పరిశోధన సంస్థ నివేదిక కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు

విద్యుత్ పరిశోధన సంస్థ సమర్పించిన నివేదిక నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ విమర్శల దాడిని ముమ్మరం చేసింది. ఈ నివేదికలో మూడు బ్యారేజీలను వినియోగించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారని బీఆర్ఎస్ నేతలు చెబుతుండగా, ఈ అంశం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టీ. జీవన్ రెడ్డి స్పందిస్తూ, కేంద్ర సంస్థ నివేదిక కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టులా మారిందని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అధికార పార్టీ ఇప్పటివరకు చేసిన ఆరోపణలు, విమర్శలు ఈ నివేదికతో బలహీనపడ్డాయని అన్నారు. ప్రాజెక్టుపై ప్రజల్లో అపోహలు సృష్టించేందుకు ప్రభుత్వం ప్రయత్నించిందని ఆరోపించారు. టీ. జీవన్ రెడ్డి మాట్లాడుతూ, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను వాడుకోవచ్చని కేంద్ర జల, విద్యుత్ పరిశోధన సంస్థ స్పష్టంగా చెప్పిందన్నారు. అలాంటి పరిస్థితిలో ప్రాజెక్టుపై ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరి ఏమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి కీలకమైన సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రాజకీయాలు చేయకుండా ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. నివేదిక వెలుగులోకి వచ్చిన తర్వాత నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించలేని పరిస్థితి ఏర్పడిందని జీవన్ రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, చేసిన ప్రకటనలపై ఇప్పుడు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికార పార్టీపై ఉందన్నారు. కేంద్ర సంస్థ అభిప్రాయాలను ప్రభుత్వం గౌరవించి తదుపరి కార్యాచరణను ప్రకటించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా జీవన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ప్రజా సమస్యలు అనేకం ఉన్న సమయంలో ఫుట్‌బాల్ కార్యక్రమం పేరుతో భారీగా ప్రజాధనం ఖర్చు చేశారని ఆరోపించారు. రూ.100 కోట్ల మేర నిధులను ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించి ఉంటే ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరేదని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉండాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ వ్యవసాయ, సాగునీటి రంగాలకు కీలకమని బీఆర్ఎస్ నేతలు పునరుద్ఘాటిస్తున్నారు. కేంద్ర సంస్థ నివేదికను పూర్తి స్థాయిలో ప్రజలకు వెల్లడించి, బ్యారేజీల వినియోగంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు?

ఎమ్మెల్యేలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలు, నియోజకవర్గాల పురోగతి, సాగునీటి ప్రాజెక్టుల అమలు తదితర అంశాలపై ఈ సందర్భంగా సమీక్ష చేపట్టారు. సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులందరూ తమ తమ నియోజకవర్గాల అభివృద్ధిపై మరింత దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ముఖ్యంగా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ పనులను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు దీర్ఘకాల ప్రయోజనం చేకూర్చే ప్రాజెక్టుల అమలులో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగంతో పాటు ప్రజాప్రతినిధులకు సూచించారు.

భూసేకరణ ప్రక్రియలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ప్రాజెక్టులు పూర్తికావడంలో తీవ్ర జాప్యం ఏర్పడుతుందని ముఖ్యమంత్రి హెచ్చరించారు. భూసేకరణ, పునరావాసం మరియు పునరుద్ధరణ కార్యక్రమాలు, అటవీ అనుమతులకు సంబంధించిన అంశాలను ప్రాధాన్యతగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలకు అవసరమైన నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేసేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సాగునీటి రంగ అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని పేర్కొన్న ముఖ్యమంత్రి, రైతులకు స్థిరమైన నీటి వనరులు అందించేందుకు వివిధ ప్రాజెక్టుల పనులను వేగంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాజెక్టుల అమలులో ఉన్న అడ్డంకులను గుర్తించి వాటిని తొలగించేందుకు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం అయితేనే ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనాలు అందుతాయని తెలిపారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, రామచంద్ర నాయక్, బీర్ల ఐలయ్య, వేముల వీరేశం పాల్గొన్నారు. అలాగే ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, కడియం కావ్య, రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య హాజరయ్యారు. అదేవిధంగా పలువురు ఎమ్మెల్యేలు కూడా సమావేశంలో పాల్గొని తమ నియోజకవర్గాల అభివృద్ధి అవసరాలు, పెండింగ్ ప్రాజెక్టుల పురోగతి, ప్రజా సమస్యలపై ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రాజెక్టుల పూర్తి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.

## డీజీపీకి బహిరంగ లేఖ రాసిన ఎంపీ



సమాచారం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ అంశంపై స్పష్టత అవసరమని డీజీపీని కోరారు. తెలంగాణ పోలీసు శాఖ రాజ్యాంగం, చట్టబద్ధ వ్యవస్థ ప్రకారమా లేక రాజకీయ కుటుంబాల ఆదేశాల మేరకా పనిచేస్తుందనే ప్రాథమిక ప్రశ్న తలెత్తుతోందని అరవింద్ వ్యాఖ్యానించారు. పోలీసు వ్యవస్థ ప్రజాస్వామ్య విలువలను కాపాడే సంస్థగా ఉండాలని, రాజకీయ ప్రభావాలకు అతీతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. పోలీసు శాఖ చట్టానికి, రాజ్యాంగానికి మాత్రమే జవాబుదారీగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఏ రాజకీయ కుటుంబానికి లేదా వ్యక్తిగత ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేయకూడదని అన్నారు. ఈ అంశంపై ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తనపై నిఘా వ్యవహారానికి సంబంధించి వాస్తవాలు వెల్లడించాలని ధర్మపురి అరవింద్ డీజీపీని కోరారు. అధికారిక ఆదేశాల ప్రకారమే ఇలాంటి చర్యలు చేపట్టారా లేదా అనే విషయంపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే ధర్మపురి అరవింద్ చేసిన ఈ ఆరోపణలపై తెలంగాణ పోలీసు శాఖ లేదా రాష్ట్ర ప్రభుత్వ వర్గాల నుంచి అధికారిక స్పందన వెలువడలేదు. ఈ వ్యవహారం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## హానర్ హోమ్స్ వ్యవహారంపై ప్రభుత్వ మౌనం ఎందుకు?



హైదరాబాద్, ఆగస్టు 24 (తరంగాలు ప్రతినిధి): ఐడీఎల్ భూముల వ్యవహారంపై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఐడీఎల్ ప్రాంతంలో హానర్ హోమ్స్ పేరుతో నిర్మిస్తున్న అపార్ట్మెంట్లలో నివాస యూనిట్లను భారీ ధరలకు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో భూముల కేటాయింపులపై సమగ్ర విచారణ జరుపుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయాన్ని గుర్తుచేస్తూ.. హానర్ హోమ్స్ వ్యవహారంపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఆయన నిలదీశారు. భూముల కేటాయింపులపై విచారణ ఎందుకు జరపడం లేదని, అక్రమాలు ఉన్నట్లు తేలితే చట్టపరమైన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఈటల రాజేందర్ ప్రశ్నించారు. సంబంధిత భూముల కేటాయింపులకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయితే భూములను తిరిగి స్వాధీనం చేసుకునే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ భూముల విలువను కాపాడుతూ రాష్ట్రానికి భారీ ఆదాయం వచ్చేలా పారదర్శక విధానాలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా జరిగే నిర్ణయాలను అడ్డుకోవాలని కోరారు. ప్రజా ఆస్తుల విషయంలో ఎలాంటి సందేహాలకు తావులేకుండా ప్రభుత్వం వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

### అర్బన్ సీలింగ్ భూముల పరిరక్షణకు చర్యలు

అర్బన్ సీలింగ్ పరిధిలోని భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నాలను నిలిపివేయాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తి అని, వాటి పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ భూముల వినియోగంపై నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. సమాజంలో ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసిన ఆయన.. సాధారణ ప్రజల జీవన పరిస్థితుల్లో మార్పు రాకపోతే అభివృద్ధి ఫలాలు అందరికీ చేరినట్లు కాదని వ్యాఖ్యానించారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించాలని, ప్రజా ప్రయోజనాలే ప్రభుత్వాల ప్రధాన లక్ష్యంగా ఉండాలని ఈటల రాజేందర్ సూచించారు.

## క్రమశిక్షణ విషయంలో 'నో కంప్రమైజ్'

సరికాదన్నారు. ఈ అంశాన్ని పార్టీ క్రమశిక్షణా సంఘం పరిశీలిస్తోందని, తగిన నిర్ణయం తీసుకునే బాధ్యత ఆ కమిటీదేనని పేర్కొన్నారు. పార్టీ వ్యవహారాలు పార్టీ వేదికలపైనే చర్చించబడతాయని స్పష్టం చేశారు.

### సుస్మిత వ్యాఖ్యలతో వివాదం

ఇటీవల వరంగల్ జిల్లా గీసుగొండలో నిర్వహించిన మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో చర్చకు దారితీశాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని ఉద్దేశించి ఆమె చేసిన వ్యాఖ్యలపై పార్టీ నాయకత్వం సీరియస్‌గా స్పందించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ క్రమశిక్షణా సంఘం మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసి, ఘటనపై వివరణ ఇవ్వాలని కోరింది. దీంతో ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

### లిఖితపూర్వకంగా సమాధానం

షోకాజ్ నోటీసుకు మంత్రి కొండా సురేఖ ఇప్పటికే లిఖితపూర్వక సమాధానం సమర్పించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగత అభిప్రాయాలని, వాటికి తనను బాధ్యురాలిని చేయరాదని ఆమె వివరణ ఇచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ వివరణను క్రమశిక్షణా సంఘం పరిశీలిస్తోంది. పార్టీ నియమ నిబంధనల ప్రకారం తదుపరి చర్యలపై క్రమశిక్షణా సంఘమే నిర్ణయం తీసుకోనుంది. సీఎం రేవంత్ రెడ్డి తాజా వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో పార్టీ క్రమశిక్షణకు ఇస్తున్న ప్రాధాన్యతను మరోసారి స్పష్టం చేశాయని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## వచ్చే ఎన్నికల్లో ఆలేరు బరిలో తీన్మార్ మల్లన్న

మేడ్చల్ మల్కాజిగిరి, ఆగస్టు 24: తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ మైదానంలో నిర్వహించిన "జెన్ జీ అడ్డా విత్ మల్లన్న" కార్యక్రమంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పాల్గొని విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వేలాది మంది విద్యార్థులు హాజరై విద్య, ఉపాధి, సామాజిక న్యాయం, రాజకీయాలు, రిజర్వేషన్లు, స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన ప్రశ్నలను సంధించగా, వాటికి మల్లన్న సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ నేటి రాజకీయ నాయకులు ప్రశ్నించే యువతను చూసి భయపడుతున్నారని అన్నారు. సామాజిక మాధ్యమాల ప్రభావంతో నేటి యువత దేశ రాజకీయ దిశను మార్చగల శక్తిగా ఎదుగుతోందని పేర్కొన్నారు. యువత అన్యాయాలపై గళమెత్తాలని, ప్రజా సమస్యలపై చైతన్యవంతంగా ఉండాలని పిలుపునిచ్చారు. విద్యా రంగంపై మాట్లాడిన తీన్మార్ మల్లన్న, విద్య మరియు వైద్య రంగాలకు కలిపి రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 40 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మొదటి తరగతి నుంచి ఉన్నత విద్య వరకు ప్రతి విద్యార్థికి పూర్తిగా ఉచిత విద్య అందించడమే తమ పార్టీ విధానమని ప్రకటించారు. ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీపై పోరాటం కొనసాగిస్తామని, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. రిజర్వేషన్ల అంశంపై స్పందిస్తూ సమాజంలో కుల వివక్ష కొనసాగుతున్నంతకాలం రిజర్వేషన్లు అవసరమేనని స్పష్టం చేశారు. రిజర్వేషన్లు తొలగించాలనే వారు ముందుగా కుల వ్యవస్థ నిర్మూలన కోసం పోరాడాలని సూచించారు. అలాగే విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు భారీగా పెండింగ్‌లో ఉన్నాయని, ఈ అంశాన్ని అసెంబ్లీలో బలంగా ప్రస్తావిస్తానని తెలిపారు. విద్యార్థుల సమస్యలపై స్పందిస్తూ పాలిటెక్నిక్, ఐటీఐ విద్యార్థుల ఉద్యమాలకు పూర్తి మద్దతు ప్రకటించారు. సరైన మౌలిక సదుపాయాలు లేకుండా విద్యాసంస్థలను విలీనం చేయడం సరైంది కాదని అన్నారు. ఆర్‌టీఈ చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్లు కల్పించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని చెప్పారు. రాజకీయంగా కీలక ప్రకటనలు చేసిన తీన్మార్ మల్లన్న, 2028 ఎన్నికల్లో ఆలేరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని వెల్లడించారు. అలాగే సెప్టెంబర్ 17 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 14 వేల కిలోమీటర్ల పాదయాత్ర చేపడతామని ప్రకటించారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎన్నికల గుర్తు "కత్తెర" అని గుర్తు చేస్తూ, ప్రజా వ్యతిరేక విధానాలను ఎదుర్కొనేందుకే ఆ గుర్తును ఎంచుకున్నామని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిట్ అవార్డులు అందజేశారు.

## ముసునూరు విజయగాథగా నిలిచింది: ఉప రాష్ట్రపతి

- అభివృద్ధి, జాతీయవాదం సమతుల్యం చేసిన నాయకత్వం
- రైతులే దేశానికి నిజమైన వెన్నెముక
- పాప్‌కార్న్ విత్తన ఆవిష్కరణలో ప్రశంసలు
- వ్యవసాయ రంగ ప్రాధాన్యంపై ఉపరాష్ట్రపతి వ్యాఖ్యలు



ఏలూరు, ఆగస్టు 24 ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయకత్వాన్ని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రశంసించారు. చంద్రబాబు ఒక నిజమైన జాతీయవాది అని, అదే సమయంలో రాష్ట్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిచ్చే నాయకుడని పేర్కొన్నారు. జాతీయవాద భావన రాష్ట్ర ప్రగతికి అడ్డంకిగా మారకుండా సమతుల్యం చేయగల సామర్థ్యం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. ఏలూరు జిల్లా ముసునూరులో నిర్వహించిన నాన్-జీఎంఓ హై ఎక్స్‌పాన్షన్ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తన ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉపరాష్ట్రపతి ఈ వ్యాఖ్యలు చేశారు. ముసునూరు గ్రామాన్ని వ్యవసాయ రంగంలో ఆదర్శంగా తీర్చిదిద్దినందుకు ముఖ్యమంత్రిని ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణాభివృద్ధి, రైతుల సంక్షేమం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ప్రోత్సాహంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ముసునూరు విజయగాథ దేశంలోని ఇతర ప్రాంతాలకు కూడా స్ఫూర్తిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమం తనకు వ్యక్తిగతంగా ఎంతో ప్రత్యేకమైందని ఉపరాష్ట్రపతి తెలిపారు. రెండు నెలల క్రితం ఒక తమిళ దినపత్రికలో పారిశ్రామికవేత్త ఎస్పీబీ పట్టాభి రామారావు మొక్కజొన్న పరిశ్రమలో సాధించిన విజయాల గురించి చదివినట్లు చెప్పారు. ఒకే వ్యవసాయ ఉత్పత్తిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ఆయన ప్రయాణం తనను ఆకట్టుకుందని, వెంటనే అభినందనల లేఖ పంపినట్లు వివరించారు. అనంతరం పట్టాభి రామారావు తనను కలిసి పాప్‌కార్న్ బహుకరించిన విషయాన్ని గుర్తుచేశారు.

THARANGALU DAILY NEWS
మంగళవారం, 25 ఆగస్టు , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## పెద్ది విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తాం..

•అనుమతి ఇప్పించండి,

•హన్మకొండ జిల్లా కలెక్టర్ కు మైనార్టీ ఉద్యమకారుల విజ్ఞప్తి.



తెలంగాణ ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ శాసనసభ్యులు, రాష్ట్ర సివిల్ సప్లై కార్పోరేషన్ చైర్మన్ గా సేవలందించిన పెద్ద సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని హనుమకొండలోని అలంకార్ సెంటర్లో ప్రతిష్టించాలనుకుంటున్నామని వరంగల్ జిల్లా మైనార్టీ ఉద్యమకారులు పేర్కొన్నారు. పెద్ది విగ్రహాన్ని అలంకార్ సెంటర్లో నెలకొలుపు కొనుటకు సంబంధిత శాఖల ద్వారా అనుమతులు ఇప్పించాల్సిందిగా హనుమకొండ జిల్లా కలెక్టర్ కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మైనార్టీ ఉద్యమకారులు మాట్లాడుతూ సాధారణ రైతు కుటుంబం నుండి తన ప్రస్థానాన్ని ప్రారంభించిన పెద్ది సుదర్శన్ రెడ్డి తనదైన శైలితో నిత్యం ప్రజా సేవలో కొనసాగడమే కాకుండా తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో అత్యంత క్రియాశీల పాత్ర పోషించిన నాయకుడు అన్నారు. ఇటీవల వారు అస్వస్థలు కాగా ప్రభుత్వం గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.దురదృష్టవశాత్తు వారు తుది శ్వాస విడిచినప్పటికీ వారి సేవలకు గుర్తుగా ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో వారి అంత్యక్రియలు జరిపిందని గుర్తు చేశారు. అటువంటి ప్రజా నాయకుల స్ఫూర్తి భావితరాలకు అందించడం కోసం విగ్రహ ఏర్పాటు కార్యక్రమం జరుగుతుందని అందుకు ప్రభుత్వం అన్ని రకాల అనుమతులు ఇప్పించాలని వారు కోరారు, ఈ కార్యక్రమంలో ఉద్యమ నాయకులు నాయిమోద్దీన్, కమరున్నీసా, షేక్ అబ్దుల్ నబీ,మాజీద్ తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ అందుబాటు లేకపోవడంతో సంబంధిత అధికారికి తమ వినతి పత్రాన్ని అందజేశారు.

## జనగామ జిల్లా కాంగ్రెస్ మహిళా కన్వీనర్‌గా ఇల్లందుల బేబీ శ్రీనివాస్



**జఫర్గడ్ ప్రతినిధి, ఆగష్టు 24,(తరంగాలు ):** జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత బలోపేతానికి, పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత పటిష్టం చేయడంతో పాటు మహిళలను, పెద్ద ఎత్తున పార్టీతో అనుసంధానం చేసే లక్ష్యంతో, ఫ్రంటల్ ఆర్గనైజేషన్స్, వివిధ సెల్స్, డిపార్ట్‌మెంట్స్‌కు ఆర్గనైజింగ్ కన్వీనర్లను జనగామ జిల్లా కాంగ్రెస్ కమిటీ డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధనవంతి లక్ష్మీనారాయణ నియమించారు. ఈ నియామకాల్లో భాగంగా,జఫర్ గడ్ మాజీ జడ్పీటీసీ, డీసీసీ జనరల్ సెక్రెటరీ ఇల్లందుల బేబీని, జిల్లా మహిళా కన్వీనర్‌గా నియమించారు. పార్టీ తనపై ఉంచిన విశ్వాసానికి, కృతజ్ఞతలు తెలిపుతున్నాను. అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా, నిర్వర్తించి కాంగ్రెస్ పార్టీని జనగామ జిల్లాలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. తనకు ఈ కీలక బాధ్యత దక్కేందుకు ప్రత్యేకంగా సహకరించిన మాజీ ఉప ముఖ్యమంత్రి, శాసనసభ్యులు కడియం శ్రీహరికి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య కి ఇల్లందుల బేబీ శ్రీనివాస్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. జనగామ జిల్లాలోని ప్రతి గ్రామం, ప్రతి మండలంలో మహిళలను కాంగ్రెస్ పార్టీతో మరింతగా అనుసంధానం చేస్తూ, మహిళల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి పార్టీ వేదికగా కృషి చేస్తానని, పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, పార్టీ విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు. మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంచుతూ, మహిళా శక్తిని ఏకతాటిపైకి తీసుకువచ్చి, కాంగ్రెస్ పార్టీకి బలమైన మహిళా కేడర్‌ను నిర్మించడమే తన ప్రధాన లక్ష్యమని ఇల్లందుల బేబీ స్పష్టం చేశారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, అంకితభావంతో పనిచేసి జనగామ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి మరింత బలమైన పునాది వేయడానికి కృషి చేస్తానని మాజీ జడ్పీటీసీ, డీసీసీ జనరల్ సెక్రెటరీ ఇల్లందుల బేబీ శ్రీనివాస్ తెలిపారు.

## 27న జిల్లా కలెక్టరేట్ ముందు జరుగు ధర్నాను జయప్రదం చేయండి

•ముక్కెర్ల యాదయ్య టిజిఈజేఏఎస్ జిల్లా కో చైర్మన్ డటి ఎస్ యు టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు

**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి ఆగస్టు 24 తరంగాలు**

తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ టిజి ఈ జె ఎ సి పిలుపుమేరకు 53/ పిట్ మెంట్ పిఆర్సిని వెంటనే ప్రకటించాలని, పెండింగ్ 6డిఏలను విడుదల చేయాలని, పెండింగ్ బకాయిలను చెల్లించాలని,కేజీబీవి ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, మినిమం టైం స్కేల్ ను అమలు పరచాలని డిమాండ్ చేస్తూ,తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ యాదాద్రి భువనగిరి కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 27న జిల్లా కలెక్టరేట్ ముందు జరుగు ధర్నాను అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని, టి జీ ఈ జె ఏ సి చైర్మన్,టీఎస్ యు టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు ముక్కెర్ల యాదయ్య కోరారు.వలిగొండ మండలములో జరిగిన సభ్యత్వ నమోదు అనంతరం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో టిఎస్ యుటిఎఫ్ మండల కమిటీ ప్రధాన కార్యదర్శి ఎన్ .వెంకటేశ్వర్లు, కె .వెంకటయ్య, కే. వెంకటయ్య టీ బిక్షపతి, అంబటి శ్రీనివాస్, కె. సైదారెడ్డి, పి.శ్రీనివాస్, కె . కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



# సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

# ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

- లబ్ధిదారులకు ఆహార భద్రత స్మార్ట్ కార్డుల పంపిణీ
- తొర్రూరు అభివృద్ధికి పెద్దపీట.. 100 పడకల ఆసుపత్రి, మినీ ట్యాంక్ బండ్ పనులకు ప్రాధాన్యం




**తొర్రూరు, ఆగస్టు 24 (తరంగాలు ):** ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలో లబ్ధిదారులకు ఆహార భద్రత స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి హాజరై లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

### తొర్రూరు అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం

తొర్రూరు పట్టణ అభివృద్ధిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రారంభమై శరవేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ఆడిటోరియం పనులు పూర్తయ్యాయని, మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి కోసం అధిక నిధులు తీసుకురావడం జరిగిందన్నారు.పట్టణంలోని సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణానికి త్వరలో శంకుస్థాపనలు చేసి పనులను ప్రారంభించి పూర్తి చేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

### ప్రతిపక్షాల విమర్శలకు ఎమ్మెల్యే కౌంటర్

ప్రభుత్వం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుంటే చూసి ఓర్వలేని ప్రతిపక్ష నాయకులు అభివృద్ధి జరగడం లేదంటూ, ఎమ్మెల్యే స్థానికంగా ఉండడం లేదంటూ లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని యశస్విని రెడ్డి విమర్శించారు. ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు.

ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి తెలిపారు.

# రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్కు

# కూనూరు క్రీడా కెరటాలు









ఆదివారం రోజున జవహర్లాల్ నెహ్రూ స్టేడియం హనుమకొండలో ఉమ్మడి వరంగల్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అడ్ హాక్ కమిటీ ఆధ్వర్యంలో సబ్ జూనియర్స్ బాలబాలికల ఎంపిక క్రీడలు నిర్వహించినట్లు పీఎం శ్రీ జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాల కూనూరు హెడ్మాస్టర్ మహమ్మద్ పర్వాజ్ తెలిపారు.కూనూరు ఉన్నత పాఠశాల నుండి బుల్లె అమూల్య (9వ తరగతి), పెద్దపెల్లి భాను శ్రీ (10 వ తరగతి), కొలిపాక రిషి వరుణ్ (10వ తరగతి) ఇటీవల పదవ తరగతి పూర్తి చేసుకుని గేమ్స్ అండ్ స్పోర్ట్స్ కోటాలో బాసర ఐఐటీ లో ప్రవేశం పొందిన చెవున బోయిన పూజశ్రీ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు ఉమ్మడి వరంగల్ జిల్లా నుండి ఈ నెల 28,29,30 తేదీల్లో బీహెచ్ఈఎల్ హైదరాబాద్ లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బాలబాలికల సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ క్రీడా పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు హెడ్మాస్టర్ మహమ్మద్ పర్వాజ్ తెలిపారు.ఎంపికైన క్రీడా విద్యార్థులను పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఆకుల సాయికుమార్,లను హెడ్మాస్టర్ స్థానిక సర్పంచ్ కాటం దేవేంద్ర మల్లారెడ్డి అభినందించారు. విద్యార్థుల ఎంపికకు సహకరించిన అసోసియేషన్ బాధ్యులు గాదెపాక అయోధ్య,కాటంరాజి రెడ్డి లకు హెడ్మాస్టర్ పర్వాజ్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో ఇంకా విజయాలు సాధించడం ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వారు పేర్కొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

•పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి






**రాయపర్తి, ఆగస్టు 24,తరంగాలు :** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి వైద్య సిబ్బందికి సూచించారు. రాయపర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. రోగులతో నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, చికిత్స, అందుతున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు, అవసరమైన మందులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని అన్నారు. అదేవిధంగా ఆసుపత్రిలో పరిశుభ్రత, మౌలిక సౌకర్యాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఇల్లందులో డ్రగ్స్‌పై పోలీసుల అవగాహన సదస్సు





• మాదకద్రవ్యాల నిర్మూలనపై ఇల్లందు పోలీస్ స్టేషన్లో సర్పంచులు, కౌన్సిలర్లతో అవగాహన సమావేశం

**ఇల్లందు ప్రతినిధి, ఆగస్ట్ 24,( తరంగాలు) :** యువతను మాదకద్రవ్యాల బారి నుంచి కాపాడేందుకు పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సి ఐ తాటిపాముల సురేష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండలంలోని పలు గ్రామాల సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐ సురేష్ గౌడ్ మాట్లాడుతూ, మత్తు పదార్థాల వల్ల ఒక వ్యక్తి జీవితమే కాదు, ఆ కుటుంబం మొత్తం నాశనమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. యువత, విద్యార్థుల భవిష్యత్తును కాపాడటం ప్రజా ప్రతినిధులుగా మనందరి బాధ్యతని, ఇల్లందు డ్రగ్స్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కౌన్సిలర్, సర్పంచులు మాట్లాడుతూ, తమ గ్రామాల్లో పాఠశాలలు, కళాశాలల్లో, వీధుల్లో డ్రగ్స్ వల్ల కలిగే శారీరక, మానసిక, చట్టపరమైన దుష్పరిణా మాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తామని తెలిపారు. అదే విధంగా బస్ స్టాండ్, పాన్ షాపులు, మెడికల్ షాపుల వద్ద అనుమానాస్పద కార్యకలా పాలపై నిఘా ఉంచి, ఎక్కడైనా గంజాయి అమ్మకం లేదా సాగు కనిపిస్తే వెంటనే ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1908,8712671111, ఈగల్ కు సమాచారం అందించాలని నిర్ణయించినట్లు చెప్పారు. యువతను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు ప్రతి వార్డులో, ప్రతి గ్రామంలో క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి వారిని చైతన్యవంతులను చేస్తామని కౌన్సిలర్లు, సర్పంచులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లు ఉమ, సారంగపాణి, కౌన్సిలర్లు కొర్లపాటి శివ కిరణ్, మెరుగు కార్తీక్, కానిస్టేబుల్ షేక్ సలీముద్దీన్, పి .నాగేశ్వరావు, దుర్గాచారి, మహేష్, బన్ని లాల్, రాణి, ఎం. నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి





**రాయపర్తి, ఆగస్టు 24,తరంగాలు :** రాయపర్తి మండలంలోని పలువురు బాధితులను, మృతుల కుటుంబ సభ్యులను పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా రాయపర్తి టౌన్ మండల యువజన నాయకుడు చెగొండ సాయి ఇటీవల బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా, ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా శివరాంపురం గ్రామ ఉప సర్పంచ్ భూక్యా లచ్చు తండ్రి భూక్యా వస్రం ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే కాట్రపల్లి గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు రాపాక సోమయ్య మరణించడంతో వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఆ భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేతో కలిసి పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డులు






• అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డులు

• పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

రాయపర్తి, ఆగస్టు 24,తరంగాలు :అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తామని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. మండలంలోని రైతు వేదికలో వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు ఆహార భద్రత స్మార్ట్ రేషన్ కార్డులను పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఆహార భద్రత స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు నిత్యావసర సరుకులు పారదర్శకంగా అందడంతో పాటు ప్రభుత్వ సేవలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని, ఏవైనా సమస్యలు ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, వివిధ గ్రామాల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు ముందు ప్రాధాన్యత ఇవ్వాలి

• వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి , ఆగస్టు 24, తరంగాలు** :ప్రజావాణి దరఖాస్తులకు ముందు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ ప్రజావాణికి మొత్తం 145 దరఖాస్తులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు 42, జీడబ్ల్యూఎంసీ కి 26 , హౌసింగ్ శాఖకు 14, డిఆర్డివో 14, ఇతర శాఖలకు సంబంధించిన 49 దరఖాస్తులు వచ్చాయి. అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేస్తూ, సమగ్రంగా పరిశీలించి ముందు ప్రాధాన్యత తో త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజావాణిలో రెవెన్యూ, హౌసింగ్, జీడబ్ల్యూఎంసీ డీఆర్డివో పరిధిలోని సమస్యలకు సంబంధించిన దరఖాస్తులే అధికంగా వచ్చాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం ప్రజావాణి ఉదయం 10 గంటలకు ప్రారంభమైనదని అందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్యపై వచ్చిన వినతులను పరిశీలించిన జిల్లా కలెక్టర్, కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్‌లో టైలరింగ్‌లో ప్రావీణ్యం కలిగిన వారికి టైలరింగ్ లో ఉపాధి అవకాశాలు కల్పించాలని సంబధిత శాఖల అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం నిమిత్తం మండలాల పరిధిలో కూడా ప్రజావాణి నిర్వహించడం జరుగుతోందని, ఇట్టి విషయాన్ని ప్రజలు గమనించి ఏదేని పెన్షన్ తదితర సమస్యలు పై మండల పరిధిలో నిర్వహిస్తున్న ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారుఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, జడ్పీ సీఈవో రామ్‌రెడ్డి, డీఆర్వో విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో డా. రాజారెడ్డి పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ వినతులను సమర్పించారు.

## సర్ ఫేజ్ 2 పై బూత్ లెవెల్ సూపర్ వైజర్ లు, బూత్ లెవెల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

• జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్

**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ప్రకటనలో మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా అనామలీస్ మరియు నోమ్యాపింగ్ గా నమోదు కాబడిన ఓటర్లకు నోటీసులు ఇవ్వనున్నారని, ఖమ్మం నియోజకవర్గ పరిధిలో 65,276, పాలేరు నియోజకవర్గ పరిధిలో 40698, మధిర నియోజకవర్గ పరిధిలో 27834, వైరా నియోజకవర్గ పరిధిలో 22,101,సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో 20226 జిల్లా మొత్తంలో 1,76,135 మంది ఓటర్లకు నోటీసులు ఇవ్వనున్నారని,అర్హత గల ప్రతి పౌరునికి వోటు హక్కు కల్పించాలని కావున ఈ తరుణంలో బూత్ లెవెల్ ఏజెంట్లు బూత్ లెవెల్ ఆఫీసర్ తో కలిసి ప్రతి ఇంటికి వెళ్ళి నోటీస్ పై వోటర్లకు అహగాహన కల్పించాలని కోరారు. అదే విధంగా ఇటీవల టి పి సి సి అద్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశానుసారం మండల , పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులను బూత్ లెవెల్ సూపర్ వైజర్ గా నియమించటం జరిగిందని, బూత్ లెవెల్ సూపర్ వైజర్ లు మండలంలోని అన్ని బూత్ లను పరిశీలించాలని, బూత్ లెవెల్ ఏజెంట్లకు తగు సలహా సూచనలు చేయాలని మండల, పట్టణ అధ్యక్షులను పత్రికాముఖంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ కోరారు. అదే విధంగాఆగస్టు 08-2026 న జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్ -2026) ప్రక్రియలో భాగంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో గ్రామ, వార్డు సభలు నిర్వహించనున్నారని కావున టి పి సి సి అద్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ల ఆదేశానుసారం బూత్ లెవెల్ సూపర్ వైజర్ లు,బూత్ లెవెల్ ఏజెంట్లు, ముఖ్య నాయకులు ఈ కార్యక్రమం అత్యంత ప్రాధాన్యతగా తీసుకొని అందరు పాల్గొని అర్హత గల ప్రతి పౌరుని ఓటు జాబితాలో చేర్చేందుకు కృషి చేయాలని కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ పత్రికా ముఖంగా కోరారు.

## వన మహోత్సవం ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ ప్రతినిధి,ఆగస్టు 24,తరంగాలు :**
మంగళవారం నిర్వహించనున్న వన మహోత్సవ కార్యక్రమం ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిల్లా అటవీ శాఖ అధికారి నిఖిత, వరంగల్ ఆర్డీవో సుమ,సంబంధిత అధికారులతో పరిశీలించారు. రంగసాయిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణాలను సందర్శించిన కలెక్టర్, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ పాల్గొననున్న వన మహోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ పరిశీలన లో కూడా సిపిఓ అజిత్ రెడ్డి, డి ఆర్ డి ఓ పి డి నాగ పద్మజ, డిహెచ్ఎస్ఒ శ్రీనివాసరావు, వరంగల్ కిలా వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్ ఇక్బాల్ ఫారెస్ట్ అధికారులు తదితరులు ఈ పరిశీలనలను జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.



# కుట్టుశిక్షణతో మహిళలకు స్వయం ఉపాధి





- కుట్టుశిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేసిన బెతి అశోక్ బాబు,చిప్ప వెంకటేశ్వర్లు
- కొత్తవాడలో రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ 3150 ఆధ్వర్యంలో కార్యక్రమం

**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 24,తరంగాలు** :కుట్టు మిషన్ శిక్షణతో మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చని బెతి అశోక్ బాబు,చిప్ప వెంకటేశ్వర్లు అన్నారు.కొత్తవాడలో రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ 3150 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టుశిక్షణ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న మొదటి బ్యాచ్ మహిళలకు సోమవారం సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ 3150 ప్రాజెక్ట్ చైర్మన్, ఆర్ టి ఎన్ పి పి బెతి అశోక్ బాబు, 23వ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్, టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు నేత ముఖ్య అతిథులుగా హాజరై మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలకు అందిస్తున్న కుట్టుశిక్షణ ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు పెరిగి, ఆర్థికంగా స్వావలంబన

సా ది, ం చే ం ద ం క ం

దోహదపడుతుందని తెలిపారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని మహిళలు తమ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవాలని ఆకాంక్షించారు.కార్యక్రమ నిర్వాహకులు గజ్జెల కావ్య, ఆడెపు శిరీష, చిప్ప కావ్య మాట్లాడుతూ.. మహిళలకు నైపుణ్య శిక్షణ అందించడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో కుట్టుశిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి సహకరిస్తున్న చిప్ప వెంకటేశ్వర్లుకు, కార్యక్రమానికి సహకరిస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ 3150 సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ శిక్షణా కేంద్రం ద్వారా ఇప్పటివరకు 100 మంది మహిళలు కుట్టుశిక్షణ పూర్తి చేసుకుని ఉపాధి పొందుతున్నారని తెలిపారు. మహిళలకు నైపుణ్య శిక్షణ అందించి, వారిని స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించడం ద్వారా మహిళా సాధికారతకు మరింత ఊతమివ్వడమే కార్యక్రమం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు.



## మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి , ఆగస్టు 24, తరంగాలు** : జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సోమవారం మట్టేవాడ ప్రభుత్వఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా భోజనం నాణ్యత, రుచి, పరిశుభ్రత, వంటశాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన, పరిశుభ్రమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భోజన తయారీ, వడ్డింపు ప్రక్రియలో పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.విద్యార్థులకు అందుతున్న భోజనం విషయంలో ఎలాంటి నాణ్యతా లోపాలు లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ తెలిపారు.

## రైతాంగ ఉద్యమ నేత సారంపల్లి మల్లారెడ్డి ఆకస్మిక మృతి తీరని లోటు

- ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్



వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 24,తరంగాలు : రైతాంగ ఉద్యమ నేత, సీపీఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి ఆకస్మిక మరణం తీవ్ర దిగ్భ్రాంతిని, శోకాన్ని కలిగించిందని, ఆయన మృతి రైతాంగ ఉద్యమానికి, ప్రజా పోరాటాలకు తీరని లోటని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యామని ఆయన తెలిపారు.రైతాంగ సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు అమరజీవి కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి అని, రైతు కూలీలు, పేదల హక్కుల సాధన కోసం తన జీవితాన్ని ధారపోసిన గొప్ప ప్రజా నాయకుడని కొనియాడారు. ఆయన మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి, ముఖ్యంగా రైతాంగ ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు.కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి కుటుంబ సభ్యులకు, అభిమానులకు, సీపీఎం శ్రేణులకు ఎంసిపిఐ(యు) తరఫున ప్రగాఢ సానుభూతిని, తీవ్ర సంతాపాన్ని తెలియజేస్తున్నామని తెలిపారు.రైతాంగ, ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసిన కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తామని పెద్దారపు రమేష్ పేర్కొన్నారు.

# చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు

- వరంగల్ కమిషనరేట్ పరిధిలో చోరీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగ మిల్స్ కాలనీ మరియు సిసిఎస్ పోలీసలు సంయుక్తంగా సోమవారం అరెస్టు చేసారు.
- నిందితుడి నుండి సుమారు 12 లక్షల విలువ గల 70.19 గ్రాముల బంగారు అభరణాలు, 527.9గ్రాముల వెండి, 29,875/- రూపాయలు నగదు, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



**తరంగాలు ప్రతినిధి 24-8-2026**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల జరిగిన వరుస దొంగతనాలకు సంబంధించి మీల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు కాగా వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత,ఐపిఎస్ అదేశాల ప్రత్యేక దర్యాప్తు బృందాలను నియమించడం జరిగింది. సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో ప్రత్యేక దృష్టి సారించి నేర విచారణ చేయడం జరిగింది. గత కాలంగా జరిగిన చోరీలను విశ్లేషణ చేయగా ఈ రోజు ఉదయం ఒక అనుమానిత వ్యక్తిని అదుపులో తీసుకోని విచారించగా మీల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చోరీలకు సంబంధించి కీలక వివరాలు వెలుగులోకి వచ్చాయి.

ఆశిష్ శ్రీనివాస్ రెడ్డిమల్ల,(27) నివాసం పెద్దపల్లి, తెలంగాణ రాష్ట్రం, ప్రస్తుతం మహరాష్ట్ర లోని చంద్రపూర్‌లో నివాసం వుంటున్న నిందితుడు సులభంగా డబ్బు సంపాదించాని తాళం వేసి వున్న ఇండ్లల్లో చోరీలకు పాల్పడినట్లుగా ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ రోజు ఉదయం మీల్స్ కాలనీ పోలీసులు వరంగల్ రైల్వే స్టేషన్‌లో అరెస్టు నిందితుడు చోరీ సోత్తును స్వాధీనం చేసుకోని విచారించగా నిందితుడు పగటి సమాయల్లో తాళం వేసివున్న ఇండ్లను గుర్తించి రాత్రి సమయాల్లో చోరీలకు పాల్పడేవాడు. ఇదే రీతిలో నిందితుడు 2024, 2025 మహారాష్ట్రలో మొత్తం నాలుగు చోరీలకు పాల్పడటంతో నిందితుడిని మహరాష్ట్ర పోలీసులు అరెస్టు చేసి జైలు తరలించగా, బెయిల్‌పై జైలు విడుదలయినాడు. నిందితుడు జైలు నుండి విడుదల ఆయిన అతనిలో ఎలాంటి మార్పురాకపోవడం మరో మారు నిందితుడు ఈ సంవత్సరం మీల్స్ కాలనీ పరిధిలోని శివనగర్, ఎస్.ఆర్.ఆర్ నగర్ ప్రాంతంలో తాళం వేసి వున్న ఇండ్లల్లో వరుస చోరీలకు పాల్పడినట్లుగా నిందితుడు విచారణలో వెల్లడించాడు. చోరీకి పాల్పడిన అంతర్ రాష్ట్ర నిందితుడి పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిసిఎస్ ఇన్స్ స్పెక్టర్ రామకృష్ణ,మీల్స్‌కాలనీ ఇన్స్ స్పెక్టర్ స్వామి, ఎస్. ఐ మహేష్, ఏ. ఏ.ఓ సల్మాన్ పాషా తో పాటు క్రైంగ్ సిసి ఎస్. మీల్స్ కాలనీ సిబ్బందిని వరంగల్ పోలీస్ కమిషనర్ అభినందించారు

.

ద ా ం ా s ి వి త ి

సెంట్రల్ జోన్ డిసిపి




## తాత్కాలిక చర్యలు కాదు శాశ్వత పరిష్కారం కావాలి

- పద్మానగర్ ఫేజ్--1లో నీటి కష్టాల పరిష్కారానికి కూన శ్రీశైలం గౌడ్ చొరవ
- నీటి సమస్యను పరిష్కరించేందుకు అధికారులతో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ భేటీ



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 24,తరంగాలు** : జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని పద్మానగర్ ఫేజ్--1 కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అధికారులను కోరారు. సోమవారం కాలనీని సందర్శించిన ఆయన స్థానికులతో మాట్లాడి నీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు.అనంతరం కాలనీవాసులతో కలిసి ప్రజావాణి కార్యక్రమంలో జలమండలి జనరల్ మేనేజర్ మాధవిని కలిసి సమస్యను వివరించారు. కాలనీలో క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి, నిరంతరాయంగా తాగునీటి సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తాత్కాలిక చర్యలతో సమస్యను పరిష్కరించడంతో పాటు, భవిష్యత్‌లో నీటి ఇబ్బందులు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కూన శ్రీశైలం గౌడ్ కోరారు.సమస్య పరిష్కారం కోసం చొరవ చూపిన కూన శ్రీశైలం గౌడ్‌కు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు, డివిజన్ కాంగ్రెస్ నాయకుడు గడ్డం రాజేందర్ రెడ్డి, దుర్గారావుతో పాటు కాలనీవాసులు ముత్యాలు, శివ నాగిరెడ్డి, మోహన్ సుబ్బారెడ్డి, భాస్కర్ రెడ్డి, వేణు, సత్యం, సురేందర్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# మహిళల భద్రతే మా ప్రధాన లక్ష్యం





## వరంగల్ లోని పోచమ్మ మైదాన్ లో ధ్రువ జూనియర్ కాలేజీలో -షీ టీమ్స్ గురించి వరంగల్ క్రైమ్‌ఏసీపీ సదయ్య అవగాహన సదస్సు

వరంగల్ తరంగాలు నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేటి కాలంలో నేరాల అదుపులో అందరు భాగస్వామ్యం కావాలని తమవంతు బాధ్యతలను నిర్వర్తించాలని, జాగ్రత్తతో మెలగడం వల్ల మహిళల మీద జరిగే నేరాలను అదుపు చేయవచ్చని వరంగల్ క్రైమ్ ఏసీపీ సదయ్య అన్నారు. వరంగల్ లోని ధ్రువ జూనియర్ కాలేజీ లో దాదాపు 250మంది విద్యార్థినిలతో సైబర్ నేరాలు, మహిళలపై జరిగే అత్యాచారాలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ సందర్భంగా వరంగల్ క్రైమ్ ఏసీపీ సదయ్య మాట్లాడుతూ అమ్మాయిలు ఫేస్ బుక్, ఇన్ స్టా గ్రామ్, స్నాప్ చాట్, టెలిగ్రామ్ లాంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని, సైబర్ నేరాల పై,అవగహన కలిగివుండాలని మరియు మహిళలు ఒంటరిగా తెలియని ప్రదేశాలకు ప్రయాణం చేయవలసి వచ్చినప్పుడు అందరు టీ-సేఫ్ ఆప్ ను ఉపయోగించుకోవాలని, టీ-సేఫ్ ఆప్ పై అవగాహన కలిగి ఉండాలని, ఉద్యోగాలు చేసే మహిళలకు తాము పనిచేసే ప్రదేశాలలో అసభ్యకరంగా ప్రవర్తించే వారి పట్ల, ఆకతాయుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, గుర్తు తెలియని వారితో తమ వ్యక్తిగత విషయాలు పంచుకోరాదని సూచించారు. ఎవరైనా మహిళలపై అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించినట్లైతే ధైర్యంగా వెంటనే షీ టీమ్ పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ1930 కి ఫిర్యాదు చేయాలని, మా షీ టీమ్ మొబైల్ నంబర్స్ సీపీ వాట్సాప్ నంబర్ 8712685257, సీఐ వాట్సాప్ నెంబర్ 8712685142, ఎస్ఐ వాట్సాప్ నెంబర్ 8712685270కు ఫిర్యాదు చేసిన వారి వివరాలను చాలా గోప్యంగా ఉంచి నేరస్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ధ్రువ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆకుల శ్రీనివాస్ మరియు ఉపాధ్యాయులు మరియు షీ టీమ్ ఎస్ ఐ స్వాతి తదితరులు పాల్గొన్నారు.




# జర్నలిస్టులకు అండగా టీజేఎఫ్

• ఖమ్మం టిజెఎఫ్

**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో** : ఖమ్మం ప్రెస్ క్లబ్ లో టి యు డబ్ల్యూ జే (టీజేఎఫ్) ఖమ్మం ప్రెస్ క్లబ్ కమిటీ సమావేశం గుద్దేటి రమేష్ బాబు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించడం జరిగింది. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కారం దిశగా ఉద్యమ కార్యాచరణ రూపొందించుకోవాలని ప్రధానంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్న వారికి అండగా ఉండాలని,ఇళ్ల స్థలాల అంశంలో రాజీలేని పోరాటం చేయడంలో టి జే ఎఫ్ ప్రెస్ క్లబ్ కమిటీ ఎప్పుడు ముందుంటుందని, గతంలో వివిధ రూపాలలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, కలిసి వచ్చే వారితో ఉద్యమ పోరాటం చేయటంలో ముందుంటుందని,అక్రిడేషన్ కార్డులు పూర్తిస్థాయిలో అర్హులకు అందివ్వాలని, యూనియన్ మరింత బలోపేతం చేయడంలో ఐక్యంగా కలిసి పనిచేయాలని తీర్మానించడం జరిగింది. ఈ సమావేశంలో ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కోశాధికారి బిక్కి గోపి , నగర కార్యదర్శి అమరవరపు కోటేశ్వరరావు, జిల్లా యూనియన్ ఉపాధ్యక్షులు మందుల ఉపేందర్, మీడియా ఇంచార్జ్ తిరుపతిరావు,ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్వీ రెడ్డి, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు రేపాక యాదగిరి, పులి శ్రీను,మూల జీవన్ రెడ్డి,సహాయ కార్యదర్శిలు ఉల్లోజు రమేష్, నాయకులు రోసి రెడ్డి, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, బొల్లెపోగు అప్పారావు, పెంటి వెంకటేశ్వర్లు,కూరపాటి నరేష్, రేపల్లె నాగ శేఖర్ ,మురళి, లింగయ్య, రామకృష్ణ, శివరామకృష్ణ, మాధవి, కిరణ్మయి,పాషా,రవి,సాంబ, శంకర్, తదితరులు పాల్గొన్నారు.ల





## మహిళల్లో పెరుగుతున్న ఎండోమెట్రియల్ క్యాన్సర్ కేసులు ఈ లక్షణాలు కనిపిస్తే జాగ్రత్త

మహిళల ఆరోగ్యానికి సంబంధించిన క్యాన్సర్లలో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ల గురించి ఎక్కువగా చర్చ జరుగుతుంటుంది. అయితే గర్భాశయంలోని లోపలి పొరను ప్రభావితం చేసే ఎండోమెట్రియల్ క్యాన్సర్ కేసులు కూడా భారత్‌లో క్రమంగా పెరుగుతున్నాయి. మారుతున్న జీవనశైలి, ఊబకాయం, మెటబాలిక్ సమస్యలు, సంతానోత్పత్తికి సంబంధించిన మార్పులు వంటి కారణాలతో ఈ క్యాన్సర్ ముప్పు పెరుగుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. 2022లో భారత్‌లో సుమారు 17,240 కొత్త ఎండోమెట్రియల్ క్యాన్సర్ కేసులు నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. గర్భాశయంలోని లోపలి పొర అయిన ఎండోమెట్రియంలో ఈ క్యాన్సర్ ఏర్పడుతుంది. వయసు పెరగడం ఒక ముఖ్యమైన ప్రమాద కారకం కాగా, ప్రొజెస్టెరాన్ తగినంత సమతుల్యం లేకుండా ఈస్ట్రోజెన్‌కు ఎక్కువకాలం గురికావడం కూడా ప్రమాదాన్ని పెంచుతుంది. ఇలా ఎక్కువకాలం హార్మోన్ల ప్రభావం కొనసాగడం వల్ల గర్భాశయ లోపలి పొరలోని కణాలు అసాధారణంగా పెరిగే అవకాశం ఉంటుంది.

### ఊబకాయం ప్రధాన కారణం..

ఎండోమెట్రియల్ క్యాన్సర్‌కు ఊబకాయాన్ని ముఖ్యమైన ప్రమాద కారకాల్లో ఒకటిగా పరిగణిస్తున్నారు. శరీరంలో అదనంగా ఉన్న కొవ్వు కేవలం శక్తి నిల్వగా మాత్రమే ఉండదు. ఇది ఇతర హార్మోన్లను ఈస్ట్రోజెన్‌గా మార్చడంలో కీలకపాత్ర పోషిస్తుంది. ఫలితంగా శరీరంలో ఈస్ట్రోజెన్‌కు ఎక్కువకాలం గురయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. భారత్‌లో ఊబకాయం పెరుగుతున్న కొద్దీ ఈ క్యాన్సర్ ముప్పు ఉన్న మహిళల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంది. చిన్న వయసులోనే రుతుస్రావం ప్రారంభం కావడం లేదా ఆలస్యంగా మెనోపాజ్ రావడం వల్ల మహిళలు జీవితకాలంలో ఎక్కువ సంవత్సరాలు ఈస్ట్రోజెన్ ప్రభావానికి గురవుతారు. పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (గ్రాజూరా), వంధ్యత్వం, కొన్ని మెటబాలిక్ సమస్యలు కూడా హార్మోన్ల సమతుల్యతను ప్రభావితం చేసి ఎండోమెట్రియల్ క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి. ఈ క్యాన్సర్‌కు సంబంధించిన ముఖ్యమైన హెచ్చరిక సంకేతాల్లో మెనోపాజ్ తర్వాత కనిపించే అసాధారణ యోని రక్తస్రావం ఒకటి. మెనోపాజ్ పూర్తయిన మహిళల్లో స్వల్పంగా రక్తపు మరకలు కనిపించినా, స్పాటింగ్ జరిగినా లేదా గోధుమ రంగు స్రావం వచ్చినా వైద్య పరీక్ష చేయించుకోవాలి. మెనోపాజ్‌కు చేరువలో ఉన్న మహిళల్లో సాధారణం కంటే ఎక్కువగా రక్తస్రావం కావడం, రెండు రుతుచక్రాల మధ్య రక్తస్రావం కనిపించడం లేదా రుతుస్రావంలో మార్పులు ఎక్కువకాలం కొనసాగడం వంటి లక్షణాలను కూడా నిర్లక్ష్యం చేయకూడదు.

### ప్రతి రక్తస్రావం క్యాన్సర్ కాదు..

మెనోపాజ్ తర్వాత వచ్చే ప్రతి రక్తస్రావం క్యాన్సర్ అని అర్థం కాదు. అయితే ప్రతి అసాధారణ రక్తస్రావాన్ని మాత్రం వైద్యపరంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే కొన్నిసార్లు ఇలాంటి లక్షణం శరీరంలో మరింత పరీక్ష అవసరమైన సమస్యకు తొలి సంకేతంగా ఉంటుంది. ఎండోమెట్రియల్ క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్సకు మంచి అవకాశాలు ఉంటాయి. అయితే వ్యాధి ముదిరే కొద్దీ చికిత్స మరింత క్లిష్టంగా మారుతుంది.

## మార్కెట్‌లో రెండు రకాల పనీర్‌లు ఉంటాయని తెలుసా అసలైన పనీర్‌ను ఎలా గుర్తించాలంటే



భారతీయ వంటకాల్లో పనీర్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ప్రోటీన్‌తోపాటు కాల్షియం వంటి పోషకాలను అందించే పనీర్‌ను చాలామంది క్రమం తప్పకుండా తీసుకుంటారు. అయితే మార్కెట్‌లో ఫ్రెష్ పనీర్‌కు ప్రత్యామ్నాయంగా అనలాగ్ పనీర్ కూడా లభిస్తోంది. రెండూ చూడడానికి, రుచి, ఆకృతిలో దాదాపు ఒకేలా కనిపించినప్పటికీ, వాటి తయారీ విధానం, పోషక విలువలు, ఆరోగ్యంపై ప్రభావంలో గణనీయమైన తేడాలు ఉంటాయి. అందువల్ల పనీర్ కొనుగోలు చేసేటప్పుడు అది నిజమైన పాలతో తయారైనదా లేదా అనలాగ్ పనీరా అనే విషయాన్ని తెలుసుకోవడం ముఖ్యం. సాధారణంగా ఫ్రెష్ పనీర్‌ను ఆవు పాలతో తయారు చేస్తారు. దీనికి విరుద్ధంగా అనలాగ్ పనీర్‌లో కూరగాయల కొవ్వులు, వెజిటబుల్ ఆయిల్స్, పాలు లేదా పాల పదార్థాలు, స్టార్చ్‌లు, ఎమల్సిఫైయర్లు, స్టెబిలైజర్లు, ఇతర యాడిటివ్స్ వంటి పదార్థాలను ఉపయోగించి పనీర్‌లా కనిపించేలా తయారు చేస్తారు. తయారీదారుని బట్టి ఉపయోగించే పదార్థాల పరిమాణం మారుతుంది. అందువల్ల అనలాగ్ పనీర్‌కు ఒకే విధమైన స్థిరమైన పోషక విలువ ఉండదు.

### పోషక విలువలు ఎలా ఉంటాయి..

భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) ప్రకారం 100 గ్రాముల ఫ్రెష్ పనీర్‌లో సుమారు 265 కేలరీలు, 18.3 గ్రాముల ప్రోటీన్, 20.8 గ్రాముల కొవ్వు, 1.2 గ్రాముల కార్బోహైడ్రేట్లు ఉంటాయి. అలాగే సుమారు 480 మిల్లీగ్రాముల కాల్షియం, 290 మిల్లీగ్రాముల ఫాస్ఫరస్, 0.2 మిల్లీగ్రాముల ఐరన్, 22 మిల్లీగ్రాముల సోడియం, 0.8 మిల్లీగ్రాముల జింక్ లభిస్తాయి. అనలాగ్ పనీర్‌లో మాత్రం తయారీ విధానాన్ని బట్టి పోషక విలువలు మారుతాయి. అందుబాటులో ఉన్న అంచనాల ప్రకారం 100 గ్రాముల అనలాగ్ పనీర్‌లో సుమారు 250 నుంచి 320 కేలరీలు, 6 నుంచి 15 గ్రాముల ప్రోటీన్, 18 నుంచి 25 గ్రాముల కొవ్వు, 5 నుంచి 15 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 100 నుంచి 400 మిల్లీగ్రాముల కాల్షియం ఉంటాయి. అంటే ఫ్రెష్ పనీర్‌తో పోలిస్తే అనలాగ్ పనీర్‌లో ప్రోటీన్ పరిమాణం తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. ఫ్రెష్ పనీర్ తయారీ ప్రక్రియ తక్కువగా ప్రాసెస్ చేసిందిగా ఉండటంతో కేసిన్, వెయ్ వంటి పాల ప్రోటీన్లు అందుతాయి. అందువల్ల ప్రోటీన్ అవసరం ఉన్నవారికి ఫ్రెష్ పనీర్ మెరుగైన ఎంపికగా ఉంటుంది. తక్కువ పరిమాణంలో తీసుకున్నా ప్రోటీన్ కారణంగా ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలిగించడంలో కూడా ఇది సహాయపడుతుంది.

### అనలాగ్ పనీర్‌తో ప్రతికూల ప్రభావాలు..

అనలాగ్ పనీర్ తక్కువ ధర, ఒకే విధమైన ఆకృతి, ఎక్కువకాలం నిల్వ ఉండే లక్షణాల కారణంగా మార్కెట్‌లో ఉపయోగంలో ఉంది. అయితే ఇందులో ఎక్కువగా ప్రాసెస్ చేసిన పదార్థాలు ఉండే అవకాశం ఉండటంతో ఫ్రెష్ పనీర్‌తో పోలిస్తే పోషక విలువ తక్కువగా ఉంటాయి. ముఖ్యంగా ప్రోటీన్ సాంద్రత తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. అనలాగ్ పనీర్‌ను తరచూ తీసుకోవడం వల్ల కొన్ని ప్రతికూల ప్రభావాలు ఉంటాయి. తయారీ విధానాన్ని బట్టి ఇందులో సోడియం ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. అధికంగా ప్రాసెస్ చేసిన పదార్థాలు జీర్ణవ్యవస్థపై ప్రభావం చూపిస్తాయి. అలాగే సూక్ష్మపోషకాల సాంద్రత తక్కువగా ఉండటం వల్ల ఇది పోషకపరంగా ఫ్రెష్ పనీర్ కంటే తక్కువ స్థాయిలో ఉంటుంది. ప్రోటీన్ తక్కువగా ఉంటే కడుపు నిండిన భావన కూడా తగ్గి, ఎక్కువ ఆహారం తీసుకునే అవకాశం ఉంటుంది. అనలాగ్ పనీర్‌ను గుర్తించడానికి ముందుగా ప్యాకెట్‌పై ఉన్న పదార్థాల జాబితాను పరిశీలించాలి. వెజిటబుల్ ఫ్యాట్స్, ఆయిల్స్, స్టార్చ్‌లు, ఎమల్సిఫైయర్లు, స్టెబిలైజర్లు వంటి పదార్థాలు ఉన్నాయా అనేది చూడాలి. కేవలం పనీర్ రంగు లేదా ఆకృతిని చూసి అది ఫ్రెష్ పనీర్ అని నిర్ణయించకూడదు.

### ఆకృతిలో తేడాలు..

ఆకృతిలో కూడా కొంత తేడా కనిపిస్తుంది. అనలాగ్ పనీర్ సాధారణంగా కొంత గట్టిగా, ఎక్కువ ఎలాస్టిక్‌గా ఉంటుంది. వండినప్పుడు కూడా సులభంగా తన ఆకృతిని కోల్పోకుండా ఉండే అవకాశం ఉంటుంది. ఫ్రెష్ పనీర్ మాత్రం మరింత సహజమైన, తాజా రుచిని కలిగి ఉంటుంది. వీలైనంత వరకు రోజూ పాల ఉత్పత్తులు తయారు చేసే నమ్మకమైన డెయిరీలు లేదా విశ్వసనీయ వనరుల నుంచి పనీర్‌ను కొనుగోలు చేయాలి. బరువు తగ్గడం లేదా ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టేవారికి కూడా ఫ్రెష్ పనీర్ ఉపయోగకరమైన ఎంపికగా ఉంటుంది. ఇందులో ఉండే అధిక-నాణ్యత ప్రోటీన్ కండరాల పునరుద్ధరణకు తోడ్పడుతుంది. తక్కువ పరిమాణంలో తీసుకున్నా ప్రోటీన్ కారణంగా కడుపు నిండిన భావన కలిగిస్తుంది. అయితే మొత్తం కేలరీలు, కొవ్వు పరిమాణం, తీసుకునే పరిమాణం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అనలాగ్ పనీర్ విషయంలో మాత్రం దాని కచ్చితమైన పోషక విలువ తయారీదారు ఉపయోగించిన పదార్థాలపై ఆధారపడి ఉంటుంది. అందువల్ల ప్యాకెట్‌పై ఉన్న ఫుడ్ లేబుల్‌ను పూర్తిగా చదివిన తర్వాతే కొనుగోలు చేయడం మంచిది. కేవలం తక్కువ ధర లేదా ఎక్కువకాలం నిల్వ ఉండటం వంటి కారణాలతో దానిని తరచూ తీసుకోవడం కంటే, అందులో ఉపయోగించిన పదార్థాలను పరిశీలించడం ముఖ్యం.

### వివరాలను పరిశీలించాలి..

పిల్లలు, క్రీడాకారులు, వృద్ధులు, ఎక్కువ ప్రోటీన్ అవసరమయ్యే వారు, అనారోగ్యం నుంచి కోలుకుంటున్న వారు తదితర వర్గాలకు ఫ్రెష్ పనీర్ మెరుగైన ఎంపికగా నిలుస్తుంది. ముఖ్యంగా పెరుగుతున్న వయసులో ఉన్నవారు లేదా ఎక్కువగా ప్రాసెస్ చేసిన ఆహారాన్ని జీర్ణించుకోవడంలో ఇబ్బంది ఉండే వారు ఫ్రెష్ పనీర్‌ను ఎంచుకోవడం మంచిది. ఫ్రెష్ పనీర్, అనలాగ్ పనీర్ రెండూ ఒకేలా కనిపించినప్పటికీ వాటి తయారీ విధానం, ప్రోటీన్, కొవ్వు, కాల్షియం వంటి పోషకాల పరిమాణం భిన్నంగా ఉంటుంది. అందువల్ల పనీర్ కొనుగోలు చేసే ముందు లేబుల్‌ను చదవడం, పదార్థాలను పరిశీలించడం, విశ్వసనీయ వనరుల నుంచి కొనుగోలు చేయడం చాలా ముఖ్యం. రోజువారీ ఆహారంలో పనీర్‌ను చేర్చుకునే వారు సాధ్యమైనంత వరకు ఫ్రెష్ పనీర్‌కు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా అధిక ప్రాసెసింగ్‌కు గురైన ప్రత్యామ్నాయాలను తగ్గించవచ్చు.

THARANGALU DAILY NEWS
మంగళవారం, 25 ఆగస్టు , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు


## సీఎం రేవంత్‌రెడ్డి ని కలిసిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య,ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**హైదరాబాద్, ఆగస్టు 24,తరంగాలు :** ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ముఖ్యమంత్రితో చర్చించారు.వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో చేపట్టాల్సిన కీలక అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పన, పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం, ప్రజలకు అవసరమైన వివిధ అభివృద్ధి పనులకు నిధుల మంజూరు తదితర అంశాలను ఎంపీ డా. కడియం కావ్య ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.అదేవిధంగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజల అవసరాలు, పెండింగ్ సమస్యలు, వివిధ ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్యమంత్రితో చర్చించారు. నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించాలని కోరారు.ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నట్లు తెలిపారు.

## దేవాదుల నీటితో రైతులకు న్యాయం చేయాలి

**●బీజేపీ మండల అధ్యక్షుడు అడుప రాజు**



**వర్ధన్నపేట ప్రతినిధి, ఆగస్టు 24,తరంగాలు : :** కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండి కూడా వర్ధన్నపేట మండలంలోని రైతుల సాగునీటి సమస్యను పట్టించుకోకపోవడం బాధాకరమని బీజేపీ వర్ధన్నపేట మండల అధ్యక్షుడు అడుప రాజు విమర్శించారు. దేవాదుల నీటిని విడుదల చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నప్పటికీ, రైతులు నీటి కోసం ఎదురుచూసే పరిస్థితి ఎందుకు వచ్చిందని ఆయన ప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని చెప్పడం కాకుండా, క్షేత్రస్థాయిలో రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారంలోకి వచ్చి ఇంతకాలమైనా మండలంలోని గ్రామాల రైతుల సాగునీటి అవసరాలను తీర్చడంలో నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు.దేవాదుల నీరు అందుబాటులో ఉన్నప్పటికీ రైతుల పొలాలకు చేరకపోతే ఆ నీటి ప్రయోజనం ఏమిటని నిలదీశారు. రైతుల సమస్యలపై రాజకీయ ప్రచారాలకు పరిమితం కాకుండా, తక్షణమే అధికారులను ఆదేశించి దేవాదుల నీటిని విడుదల చేయించాలని డిమాండ్ చేశారు.రైతులకు నీరు అందించడం ప్రభుత్వ బాధ్యతే.. మాటలతో కాకుండా చేతల్లో చూపించాలని ఆయన కాంగ్రెస్ నాయకులకు సూచించారు. సాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించి వర్ధన్నపేట మండల రైతులకు న్యాయం చేయాలని కోరారు.

## యశస్వి జైస్వాల్‌కు భారీ ఊరట!

టీమిండియా ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు భారీ ఊరట లభించింది. శ్రీలంక ప్లేయర్ అసిత ఫెర్నాండోతో గొడవ పడిన ఘటనలో ఐసీసీ జరిమానాతో సరిపెట్టింది. యశస్వి జైస్వాల్‌తో పాటు అసిత ఫెర్నాండో మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్ కేటాయించింది. ఈ ఘటనలో యశస్వి జైస్వాల్‌దే తప్పంటూ మాజీ క్రికెటర్లు, కామెంటేటర్లు తీర్పు ఇచ్చారు. దాంతో యశస్వి జైస్వాల్‌పై నిషేధం పడుతుందని అంతా అనుకున్నారు. కానీ మ్యాచ్ రిఫరీ లెవెల్-1 నేరంగా పరిగణించి రూల్స్ ప్రకారం చర్యలు తీసుకున్నారు. ఈ చర్యలకు సంబంధించి ఐసీసీ ఓ ప్రకటనను విడుదల చేసింది. 'ఆదివారం కొలంబో వేదికగా మొదలైన రెండో టెస్ట్ తొలి రోజున ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని లెవెల్ 1 రూల్‌ను ఉల్లంఘించిన శ్రీలంక పేసర్ అసితా ఫెర్నాండో, భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ల మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధిస్తూ మ్యాచ్ రిఫరీ చర్యలు తీసుకున్నారు. ఆర్టికల్ 2.12 ప్రకారం ఒక ప్లేయర్, సపోర్ట్ స్టాఫ్, అంపైర్‌తో భౌతిక ఘర్షణకు దిగడం నేరం.మ్యాచ్ ఫీజు కోతతో పాటు చెరో డీ మెరిట్ పాయింట్ కేటాయించారు. తమ తప్పులను ఫెర్నాండో, జైస్వాల్ అంగీకరించారు. దాంతో అధికారిక విచారణ అవసరం లేకుండానే ఈ శిక్షలు ఖరారు చేస్తున్నాం. లెవెల్ 1 ఉల్లంఘనకు పాల్పడినప్పుడు కనీస శిక్షగా హెచ్చరిక, గరిష్టంగా ఆటగాడి మ్యాచ్ ఫీజులో 50 శాతం, ఒకటి లేదా రెండు డీమెరిట్ పాయింట్స్ ఉంటాయి.'అని ఐసీసీ తమ ప్రకటనలో పేర్కొంది. కొలంబో వేదికగా ఆదివారం ప్రారంభమైన రెండో టెస్ట్‌లో యశస్వి జైస్వాల్ దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. అసిత ఫెర్నాండో వేసిన ఒకే ఓవర్లో వరుసగా మూడు ఫోర్లు బాదాడు. ఆ తర్వాత ఫెర్నాండో ఒక అద్భుతమైన డెలివరీతో జైస్వాల్‌ను 45 పరుగుల వద్ద క్లీన్ బౌల్డ్ చేశాడు. వికెట్ తీసిన అనంతరం ఫెర్నాండో అత్యుత్సాహంగా సెలెబ్రేట్ చేసుకున్నాడు. ఈ క్రమంలో అతను ఏదో మాట అన్నాడు. అది విన్న జైస్వాల్ ఆగ్రహంతో అతనిపైకి దూసుకెళ్లాడు. ఒకరికొకరు ఎదురెదురుగా నిలబడి నోరుపారేసుకున్నారు. ఈ క్రమంలో జైస్వాల్ హెల్మెట్ ఫెర్నాండో నుదుటికి తాకింది. దాంతో శ్రీలంక కెప్టెన్ ధనంజయ డిసిల్వా, వైస్ కెప్టెన్ కమిందు మెండిస్ జోక్యం చేసుకొని ఇద్దర్నీ విడదీసాడు.

## ఇంగ్లాండ్ స్టార్ ఫాస్ట్ బౌలర్ బ్రైడన్ కార్స్ అరెస్ట్

పాకిస్తాన్‌తో రెండో టెస్ట్ ప్రారంభం కావడానికి ముందే ఇంగ్లాండ్ క్రికెట్ జట్టులో తీవ్ర కలకలం చెలరేగింది. ఇంగ్లాండ్ స్టార్ ఫాస్ట్ బౌలర్ బ్రైడన్ కార్స్ శనివారం రాత్రి డెర్బీలోని ఒక నైట్‌క్లబ్ వద్ద జరిగిన గొడవలో ఇరుక్కున్నాడు. పోలీసులు అతడి చేతులకు బేడీలు వేసి క్లబ్ నుంచి బయటకు తీసుకెళ్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో విపరీతంగా హల్చల్ చేస్తున్నాయి. డెర్బీషైర్‌తో జరిగిన కౌంటీ ఛాంపియన్‌షిప్ మ్యాచ్‌లో డర్హామ్ తరపున ఆడిన కార్స్, తన సహచర బౌలర్ మాథ్యూ పాట్స్ తో కలిసి నైట్‌క్లబ్‌కు వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ వ్యవహారంపై ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) అధికారికంగా స్పందిస్తూ సమగ్ర విచారణ జరుపుతున్నట్లు తెలిపింది. డెర్బీలో జరిగిన కౌంటీ మ్యాచ్‌లో డర్హామ్ జట్టు 338 పరుగుల తేడాతో విజయం సాధించిన తర్వాత ఈ ఘటన చోటు చేసుకుంది. 31 ఏళ్ల బ్రైడన్ కార్స్ క్లబ్ లో గొడవకు దిగడంతో పోలీసులు నేరుగా రంగంలోకి దిగి అతడిని అరెస్టు చేశారు. "గత రాత్రి డెర్బీలో జరిగిన సంఘటన మా దృష్టికి వచ్చింది.

# కళాకారుల ప్రతిభ సమాజానికి ఎంతో అవసరం





- **భావితరాలకు మన సంస్కృతిని అందిద్దాం**
- **యువతను సంస్కృతి, సంప్రదాయాల వైపు నడిపించాలి**
- **తల్లిదండ్రులే పిల్లలకు సంస్కృతి,సంప్రదాయాలపై అవగాహన కల్పించాలి**
- **యువత సన్మార్గంలో నడిచి ఆదర్శంగా నిలువాలి**
- **ఉభయ తెలుగు రాష్ట్రాల కళాకారుల సంక్షేమ మండలి అధ్యక్షులు, విశిష్ట కళా సేవ రత్న పురస్కార గ్రహీత, కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం**

**హన్మకొండ ప్రతినిధి,ఆగస్టు 24,తరంగాలు :** భావితరాలకు మన సంస్కృతిని అందిద్దామని,కళాకారుల ప్రతిభ సమాజానికి ఎంతో అవసరమని ఈగ మల్లేశం అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ మరియు జెబి కల్చరల్ ఆర్ట్ సొసైటీ (వరంగల్) ఆధ్వర్యంలో స్థానిక పబ్లిక్ గార్డెన్‌లోని పద్మ శ్రీ డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో జరుగుతున్న "ఓరుగల్లు జానపదాల స్వరాల ఝల్లు కాకతీయ సకల కళల జాతర" ఉత్సవాలు రెండోవ రోజు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉభయ తెలుగు రాష్ట్రాల కళాకారుల సంక్షేమ మండలి అధ్యక్షులు, విశిష్ట కళా సేవ రత్న పురస్కార గ్రహీత, కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జానపద కళాకారులు, కవులు, గాయకులను ఒకే తాటిపైకి తెచ్చి 'కళాకారుల జేఏసీ'గా ఏర్పాటు చేసి ఓరుగల్లు (వరంగల్) వీరత్వానికి, కళలకు పుట్టినిల్లు కావడంతో, ఇక్కడి నుండి సాగిన ధూం ధాం ప్రదర్శనలతో ప్రజలకు తెలంగాణ అస్తిత్వాన్ని ప్రతిబింబించే విధంగా జానపద కళాకారులు, కవులు మరియు గాయకులు అత్యంత కీలకమైన పాత్ర పోషించి తమ ఆట, పాట మరియు మాటలతో ప్రజలను ఉద్యమం వైపు నడిపించడంలో కళాకారుల త్యాగం మరియు కృషి ఎనలేనివి అని కళాకారుల గొంతుకలు, వారి ప్రతిభ సమాజానికి ఎంతో అవసరమని కొనియాడారు.

నేటి సాంకేతిక యుగంలో యువత తప్పుదోవ పట్టకుండా ఉండటానికి మన జానపద కళలు, సంస్కృతి, సంప్రదాయాలు ఒక దిక్సూచిలా పనిచేస్తాయని, ఇతిహాసాలు, కథలు మన జీవితంలో ఏది మంచి, ఏది చెడు అని నేర్పే జీవన వేదాలని, కళను నేర్చుకోవడం వల్ల యువతలో ఏకాగ్రత, పట్టుదల మరియు క్రమశిక్షణ పెరిగి చెడు సావాసాలకు దూరంగా ఉండడానికి తోర్పడతాయని అన్నారు. అలాగే తల్లిదండ్రులు పిల్లలకు చిన్నతనం నుంచే పిల్లలకు మన మూలాలు మన సంస్కృతిని, పురాణ పురుషుల కథలను, వారి త్యాగాలను, ధర్మాన్ని వివరించి వాటిని భవిష్యత్తు తరాలకు అందించినప్పుడే ఆరోగ్యకరమైన సమాజంతో పాటు మన సంస్కృతి సజీవంగా ఉండి నేటి యువత మన సంస్కృతీ సంప్రదాయాల వైపు అడుగులు వేసేలా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కళలు కేవలం వినోదాన్ని మాత్రమే కాక, సమాజానికి అవసరమైన నైతిక విలువలను, క్రమశిక్షణను మరియు సాంస్కృతిక స్పృహను అందిస్తాయని, మన జానపద, శాస్త్రీయ కళలను ఆదరించడం అంటే మన అస్తిత్వాన్ని మనం కాపాడుకోవడం అని యువతను ఈ కళల వైపు నడిపిస్తే, వారు చెడు వ్యసనాలకు దూరమవ్వడమే కాకుండా సమాజానికి ఉపయోగపడే సంస్కారవంతులుగా ఎదుగుతారు అని తెలిపారు.అనంతరం ముఖ్య అతిథి ఈగ మల్లేశం కళాకారుల ప్రతిభను అభినందిస్తూ కళాకారులకు, ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన జె బి కల్చరల్ ఆర్ట్ సొసైటీ జడల శివ కు శాలువా కప్పి మెమెంటోలతో గౌరవప్రదంగా సన్మానించారు. సభా కార్యక్రమం అనంతరం జె.బి. కల్చరల్ ఆర్ట్ సొసైటీ నిర్వాహకులు, కళాకారులందరూ కలిసి ముఖ్య అతిథి ఈగ మల్లేశం సమాజానికి మరియు కళారంగానికి చేసిన సేవలను కొనియాడుతూ శాలువా, గజమాలతో ఘనంగా సత్కరించి ప్రత్యేక జ్ఞాపికను (మెమొంటో) బహుకరించారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త ఆడెపు రవీందర్ , వడ్నాల నరేందర్, కరిమిల సంపత్ రావు, జూలూరి శ్రీనివాస్, సంపత్, దీకొండ ప్రమీల సారంగపాణి, రాజ్యలక్ష్మి, హిందీ సింగర్ శ్యామ్ , మక్దూం, ప్రసాద్, ఎస్కే రాజు, సురేందర్ ,ఇమ్మానుయేల్, మున్నా, తోట రవి, రంగనాథ్, చంద్రశేఖర్, నిమ్మల శ్రీను, బుజంగారావు, శిభ, రోజరాణి, గాయత్రి ,బిక్షపతి, శ్రీకాంత్, మురళి మధు, కాజిపేట ప్రభాకర్, చిరంజీవి, ప్రవీణ్, మామిండ్ల లక్ష్మణ్ ,ప్రముఖ జానపద కళాకారులు గర్జన గిద్దె రాంనర్సయ్య, బాబ్జి, జూపక శివ, మురళి మధు, శ్రీకాంత్, ప్రసాద్, ధార దేవేందర్, రేల కుమార్, శంకర్ సురేందర్, మ్యాజిక్ శ్రీను, సృజన్ రావు, రంగనాథ్, గుజ్జరీ రమేష్, చంద్రమౌళి, ప్రభాకర్ గార్లకు లకు పురస్కార అవార్డులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి వాఖ్యాతగా జనగాం రాము వ్యవహరించారు ,అలాగే తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుండి జానపద, ఒగ్గు, చిందు, యాక్షగానం, భాగవతులు, శాస్రియ కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.



## సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షురాలిగా

# "కుల్లా పావని-యాకాంతం





- **ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు ప్రకటన**

**వర్ధన్నపేట ప్రతినిధి, ఆగస్టు 24,తరంగాలు :** వర్ధన్నపేట మండల సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షురాలిగా వెంకట్రావుపల్లి గ్రామ సర్పంచ్ కుల్లా పావని యాకాంతం నియమితులయ్యారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు ఆమెను మండల అధ్యక్షురాలిగా ప్రకటించినట్లు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్ తెలిపారు.ఈ సందర్భంగా పోశాల వెంకన్న మాట్లాడుతూ.. మండలంలోని సర్పంచుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కుల్లా పావని కృషి చేయాలని ఆకాంక్షించారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ నరుకుడు వెంకటయ్య, ఐనవోలు ఆలయ కమిటీ ఛైర్మన్ ప్రభాకర్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎద్దు సత్య నారాయణ , బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, మెరుగు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
మంగళవారం, 25 ఆగస్టు , 2026



# భారీ స్కోర్ వద్ద భారత్ డిక్లేర్డ్!



### ధ్రువ్ జురెల్ అజేయ శతకం

శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియా భారీ స్కోర్ చేసింది. ధ్రువ్ జురెల్(177 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో 115 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగడంతో తొలి ఇన్నింగ్స్‌ను భారత్ 503/9 భారీ స్కోర్ వద్ద డిక్లేర్డ్ చేసింది. రిషభ్ పంత్(89 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 63) హాఫ్ సెంచరీతో రాణించాడు. తొలి రోజు ఆటలో దేవదత్ పడిక్కల్(193 బంతుల్లో 12 ఫోర్లతో 117) సెంచరీతో చెలరేగగా.. శుభ్‌మన్ గిల్(108 బంతుల్లో 6 ఫోర్లతో 50) హాఫ్ సెంచరీతో రాణించిన సంగతి తెలిసిందే. శ్రీలంక బౌలర్లలో అసితా ఫెర్నాండో(4/106) నాలుగు వికెట్లు తీయగా..ప్రభాత్ జయసూర్య కేశర నువాంత్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. లాహిరు కుమారాకు ఒక వికెట్ దక్కింది. అనంతరం శ్రీలంక బ్యాటింగ్‌కు దిగగా 2 బంతులు పడగానే వర్షం అంతరాయం కలిగించింది. ఆ తర్వాత ఆట తిరిగి ప్రారంభం కాగా.. శ్రీలంక 3 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 8 పరుగులు చేసింది. లాహిరు ఉడారా(1) ప్రసిధ్ కృష్ణ ఔట్ చేయగా.. ప్రభాత్ జయసూర్య(2)ను మానవ్ సుతార్ పెవిలియన్ చేర్చాడు. వర్షం కారణంగా రెండో రోజు 56 ఓవర్ల ఆటనే సాధ్యమైంది. 300/5 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను కొనసాగించిన భారత్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. ఓవర్‌నైట్ బ్యాటర్ సారాన్ష్ జైన్(6) రెండు పరుగులు మాత్రమే చేసి అసితా ఫెర్నాండో బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేరాడు. దాంతో తొలి రోజు ఆటలో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన రిషభ్ పంత్ మళ్లీ బ్యాటింగ్‌కు దిగాడు. ధ్రువ్ జురెల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. తనదైన శైలిలో చెలరేగిన ఈ జోడీ వేగంగా పరుగులు రాబట్టింది. ముఖ్యంగా పంత్ భారీ షాట్లతో లంకబౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలో పంత్ 81 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకోగా.. ధ్రువ్ జురెల్ 97 బంతుల్లో అర్ధశతకం సాధించాడు. దాంతో భారత్ 419/6 స్కోర్ వద్ద లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లో పంత్ దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. అయితే అతన్ని కుశార నువాంత క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో ఏడో వికెట్‌కు నమోదైన 112 పరుగుల భారీ భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి మానవ్ సుతార్ రాగా.. ధ్రువ్ జురెల్ తన జోరును కొనసాగించాడు. ఆచితూచిన ఆడిన మానవ్ సుతార్(18)ను ప్రబాత్ జయసూర్య కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చగా.. సిరాజ్‌తో కలిసి ధ్రువ్ జురెల్ రెండో సెషన్‌ను ముగించాడు. వర్షం కారణంగా కాస్త ముందుగానే ఈ సెషన్ ముగిసింది. ఆఖరి సెషన్‌లో దూకుడుగా ఆడిన ధ్రువ్ జురెల్ 171 బంతుల్లో సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఆ వెంటనే భారీ సిక్సర్‌తో ధ్రువ్ జురెల్ తన జోరు కనబర్చగా.. సిరాజ్(3) ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. దూకుడుగా ఆడిన ధ్రువ్ జురెల్ వేగంగా పరుగులు రాబట్టి జట్టు స్కోర్‌ను 500 ధాటించాడు. ఆ వెంటనే భారత్ తమ ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది.

# పంత్ సరికొత్త చరిత్ర..



భారత స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ మరో అరుదైన చారిత్రాత్మక రికార్డును సాధించాడు. విదేశాల్లో లేదా న్యూట్రల్ వేదికల్లో జరిగిన టెస్టుల్లో భారత వికెట్ కీపర్‌గా అత్యధిక పరుగులు సాధించిన లెజెండరీ క్రికెటర్ ఎంఎస్ ధోనీ పేరిట ఉన్న ఆల్ టైమ్ రికార్డును పంత్ బ్రేక్ చేశాడు. కొలంబో వేదికగా శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్ట్ రెండో రోజు ఆటలో పంత్ ఈ ఘనతను నమోదు చేశాడు. ఈ విభాగంలో 2500 పరుగుల మార్కును దాటిన పంత్, ధోనీ సాధించిన 2496 పరుగుల రికార్డును అధిగమించి అగ్రస్థానంలో నిలిచాడు. ధోనీ 32.84 సగటుతో ఆ పరుగులు చేయగా, పంత్ దాదాపు 42 సగటుతో ఈ మైలురాయిని అందుకోవడం గమనార్హం. ఈ లిస్టులో ఫరూక్ ఇంజనీర్ (1209 రన్స్), సయ్యద్ కిర్మాణి (1109 రన్స్), కిరణ్ మోరే (901 రన్స్) తర్వాతి స్థానాల్లో నిలిచారు.. ఈ రికార్డు నమోదు కావడానికి ఒక రోజు ముందు పంత్ మైదానంలో తీవ్ర గాయానికి లోనయ్యాడు. మొదటి రోజు ఆట మూడో సెషన్‌లో శ్రీలంక పేసర్ లహిరు కుమార వేసిన షార్ట్ పిచ్ బంతిని పుల్ చేసే క్రమంలో పంత్ ఎడమ చేతి మణికట్టుకు గాయం అయింది. నొప్పితో విలవిల్లాడిన పంత్ కు భారత జట్టు ఫిజియో ఐస్ ప్యాక్ పెట్టి కట్టు కట్టినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ తీవ్ర అసౌకర్యంగా అనిపించడంతో 15 బంతుల్లో 3 పరుగులు చేసిన తర్వాత 58వ ఓవర్లో పంత్ రిటైర్డ్ హర్ట్ గా వెనుదిరిగాడు. గాయం తీవ్రత భయపెట్టినప్పటికీ, రెండో రోజు ఉదయం భారత్ ఆరో వికెట్ కోల్పోయిన తర్వాత పంత్ తిరిగి బ్యాటింగ్ కు వచ్చాడు. అసిథ ఫెర్నాండో, ఇతర లంక పేసర్లు వరుసగా బౌన్సర్లతో దాడి చేస్తూ అతడి భుజానికి కూడా బంతులు తాకించినా పంత్ ఏమాత్రం లెక్క చేయలేదు. నొప్పిని భరిస్తూనే మరో వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ తో కలిసి జట్టు ఇన్నింగ్స్ ను ముందుకు నడిపించాడు. ఇద్దరూ కలిసి సమయోచిత భాగస్వామ్యంతో లంక బౌలర్లను దీటుగా ఎదుర్కొని స్కోరు బోర్డును ముందుకు తీసుకెళ్లారు. శ్రీలంక బౌలర్లు తీవ్రంగా ఒత్తిడి తెస్తున్న సమయంలో పంత్ చూపిన అంకితభావం జట్టుకు కొండంత బలాన్ని ఇచ్చిందనడంలో సందేహం లేదు. ఇక వీళ్లిద్దరూ సాధికారికంగా బ్యాటింగ్ చేస్తూ, అబేధ్యమైన ఏడో వికెట్ కు 112 పరుగులు జోడించారు. లంచ్ విరామ సమయానికి టీమిండియా 112 ఓవర్లలో 6 వికెట్లకు 419 పరుగులు చేసింది. పంత్ (63 బ్యాటింగ్)తో పాటు జురేల్ (59 బ్యాటింగ్) అర్ధ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. ఫెర్నాండోకు నాలుగు వికెట్లు దక్కాయి. ఇప్పటికే గాలే టెస్ట్ లో భారత్ 165 రన్స్ తో గెలిచి సిరీస్ లో 1-0 లీడ్ లో ఉండగా, కొలంబోలోనూ పంత్ పోరాటంతో జట్టు పటిష్ట స్థితికి చేరింది.

# డయాబెటిస్‌తో మతిమరుపు...




డయాబెటిస్ అనేది పెనుభూతంగా మారిన సంగతి తెలిసిందే. భారతదేశంలోనూ షుగర్ వ్యాధిగ్రస్థుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. కడుపు నిండా ఏది తిందామన్నా రక్తంలో షుగర్ లెవల్స్ ఎక్కడ పెరిగిపోతాయోననే భయం వారిని వెంటాడుతూనే ఉంది. అందుకే భోజనం విషయంలో అనేక జాగ్రత్తలు తీసుకుంటుంటారు. లెక్కలేసుకుని మరీ ఎంత తినాలో అంతే తింటుంటారు. అలాగే షుగర్‌తో వచ్చే ఇతర ఆరోగ్య ప్రమాదాల గురించీ ఎంతో అప్రమత్తంగా ఉంటుంటారు. అలాంటి డయాబెటిస్ రోగులకు మరో షాకింగ్ న్యూస్. వారికి మతిమరుపు వచ్చే ప్రమాదం పొంచి ఉందని తాజా అధ్యయనం చెబుతోంది. బోస్టన్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రముఖ డాక్టర్ జెన్నిఫర్ వీవ్ నేతృత్వంలో చేసిన తాజా అధ్యయనంలో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి.

డయాబెటిస్ రోగులకు డిమెన్షియా(మతిమరుపు) వచ్చే ప్రమాదం ఉందని ఆ అధ్యయనంలో తేలింది. సాధారణ వ్యక్తుల కంటే వీరికి ఈ వ్యాధి వచ్చే ప్రమాదం మూడు రెట్లు అధికంగా పొంచి ఉందని జెన్నిఫర్ తెలిపారు. సుమారు 2.83లక్షల మందిపై సుదీర్ఘ అధ్యయనం చేసి ఈ విషయాన్ని కనుగొన్నట్లు చెప్పారు. దీనికి సంబంధించిన వివరాలను అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీకి చెందిన న్యూరాలజీ పత్రికలో ప్రచురితమయ్యాయి. టైప్-1 డయాబెటిస్ ఉన్నవారికి భవిష్యత్తులో మతిమరుపు వ్యాధి వచ్చే అవకాశం 3 రెట్లు అధికంగా ఉందని.. టైప్-2 డయాబెటిస్ వచ్చే వారికి ఈ ముప్పు 2 రెట్లు అధికంగా ఉందని అధ్యయనం చెబుతోంది. సాధారణ వ్యక్తులకు అంటే డయాబెటిస్ లేని వారిలో కేవలం 0.6 శాతం మందికి మాత్రమే డిమెన్షియా రాగా.. టైప్-1 బాధితుల్లో 2.6శాతం మందికి వచ్చినట్లు గణాంకాలు చెబుతున్నాయి. టైప్-1 డయాబెటిస్ మొత్తం డయాబెటిస్ కేసుల్లో 5 శాతమే అయినా.. మెదడుపై చాలా ప్రభావం చూపిస్తుందని జెన్నిఫర్ చెబుతున్నారు. ఇలాంటి వారిలో 65 శాతం డిమెన్షియా కేసులను నేరుగా షుగర్ వ్యాధికే ఆపాదించవచ్చని ఆమె వివరించారు.

## యశస్వి జైస్వాల్‌కు భారీ ఊరట!



టీమిండియా ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు భారీ ఊరట లభించింది. శ్రీలంక ప్లేయర్ అసిత ఫెర్నాండోతో గొడవ పడిన ఘటనలో ఐసీసీ జరిమానాతో సరిపెట్టింది. యశస్వి జైస్వాల్‌తో పాటు అసిత ఫెర్నాండో మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్ కేటాయించింది. ఈ ఘటనలో యశస్వి జైస్వాల్‌దే తప్పంటూ మాజీ క్రికెటర్లు, కామెంటేటర్లు తీర్పు ఇచ్చారు. దాంతో యశస్వి జైస్వాల్‌పై నిషేధం పడుతుందని అంతా అనుకున్నారు. కానీ మ్యాచ్ రిఫరీ లెవెల్-1 నేరంగా పరిగణించి రూల్స్ ప్రకారం చర్యలు తీసుకున్నారు. ఈ చర్యలకు సంబంధించి ఐసీసీ ఓ ప్రకటనను విడుదల చేసింది. 'ఆదివారం కొలంబో వేదికగా మొదలైన రెండో టెస్ట్ తొలి రోజున ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని లెవెల్ 1 రూల్‌ను ఉల్లంఘించిన శ్రీలంక పేసర్ అసితా ఫెర్నాండో, భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ల మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధిస్తూ మ్యాచ్ రిఫరీ చర్యలు తీసుకున్నారు. ఆర్టికల్ 2.12 ప్రకారం ఒక ప్లేయర్, సపోర్ట్ స్టాఫ్, అంపైర్‌తో భౌతిక ఘర్షణకు దిగడం నేరం.మ్యాచ్ ఫీజు కోతతో పాటు చెరో డీ మెరిట్ పాయింట్ కేటాయించారు. తమ తప్పులను ఫెర్నాండో, జైస్వాల్ అంగీకరించారు. దాంతో అధికారిక విచారణ అవసరం లేకుండానే ఈ శిక్షలు ఖరారు చేస్తున్నాం. లెవెల్ 1 ఉల్లంఘనకు పాల్పడినప్పుడు కనీస శిక్షగా హెచ్చరిక, గరిష్టంగా ఆటగాడి మ్యాచ్ ఫీజులో 50 శాతం, ఒకటి లేదా రెండు డీమెరిట్ పాయింట్స్ ఉంటాయి.'అని ఐసీసీ తమ ప్రకటనలో పేర్కొంది. కొలంబో వేదికగా ఆదివారం ప్రారంభమైన రెండో టెస్ట్‌లో యశస్వి జైస్వాల్ దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. అసిత ఫెర్నాండో వేసిన ఒకే ఓవర్లో వరుసగా మూడు ఫోర్లు బాదాడు. ఆ తర్వాత ఫెర్నాండో ఒక అద్భుతమైన డెలివరీతో జైస్వాల్‌ను 45 పరుగుల వద్ద క్లీన్ బౌల్డ్ చేశాడు. వికెట్ తీసిన అనంతరం ఫెర్నాండో అత్యుత్సాహంగా సెలెబ్రేట్ చేసుకున్నాడు. ఈ క్రమంలో అతను ఏదో మాట అన్నాడు. అది విన్న జైస్వాల్ ఆగ్రహంతో అతనిపైకి దూసుకెళ్లాడు. ఒకరికొకరు ఎదురెదురుగా నిలబడి నోరుపారేసుకున్నారు. ఈ క్రమంలో జైస్వాల్ హెల్మెట్ ఫెర్నాండో నుదుటికి తాకింది. దాంతో శ్రీలంక కెప్టెన్ ధనంజయ డిసిల్వా, వైస్ కెప్టెన్ కమిందు మెండీస్ జోక్యం చేసుకొని ఇద్దర్నీ విడదీసాడు.

## ఇంగ్లాండ్ స్టార్ ఫాస్ట్ బౌలర్ బ్రైడన్ కార్స్ అరెస్ట్

పాకిస్తాన్‌తో రెండో టెస్ట్ ప్రారంభం కావడానికి ముందే ఇంగ్లాండ్ క్రికెట్ జట్టులో తీవ్ర కలకలం చెలరేగింది. ఇంగ్లాండ్ స్టార్ ఫాస్ట్ బౌలర్ బ్రైడన్ కార్స్ శనివారం రాత్రి డెర్బీలోని ఒక నైట్‌క్లబ్ వద్ద జరిగిన గొడవలో ఇరుక్కున్నాడు. పోలీసులు అతడి చేతులకు బేడీలు వేసి క్లబ్ నుంచి బయటకు తీసుకెళ్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో విపరీతంగా హల్చల్ చేస్తున్నాయి. డెర్బీషైర్‌తో జరిగిన కౌంటీ ఛాంపియన్‌షిప్ మ్యాచ్‌లో దర్హామ్ తరఫున ఆడిన కార్స్, తన సహచర బౌలర్ మాథ్యూ పాట్స్ తో కలిసి నైట్‌క్లబ్‌కు వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ వ్యవహారంపై ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) అధికారికంగా స్పందిస్తూ సమగ్ర విచారణ జరుపుతున్నట్లు తెలిపింది. డెర్బీలో జరిగిన కౌంటీ మ్యాచ్‌లో దర్హామ్ జట్టు 338 పరుగుల తేడాతో విజయం సాధించిన తర్వాత ఈ ఘటన చోటు చేసుకుంది. 31 ఏళ్ల బ్రైడన్ కార్స్ క్లబ్ లో గొడవకు దిగడంతో పోలీసులు నేరుగా రంగంలోకి దిగి అతడిని అరెస్టు చేశారు. “గత రాత్రి డెర్బీలో జరిగిన సంఘటన మా దృష్టికి వచ్చింది. దీనిపై ప్రస్తుతం దర్యాప్తు స్టార్ట్ అయింది, పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తాం” అని ఈసీబీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ వీడియో బయటకు రావడంతో ఇంగ్లాండ్ క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఆస్ట్రేలియా పర్యటనలో జరిగిన 2025-26 యాషెస్ సిరీస్‌లో ఇంగ్లాండ్ ఘోరంగా ఓడినప్పటికీ, బ్రైడన్ కార్స్ 22 వికెట్లతో అద్భుతంగా రాణించాడు. ప్రస్తుతం పాకిస్తాన్‌తో జరుగుతున్న మూడు టెస్టుల సిరీస్‌లో తొలి రెండు టెస్టుల కోసం ఎంపిక చేసిన ఇంగ్లాండ్ స్క్వాడ్‌లో కార్స్ చోటు దక్కించుకున్నాడు. లీడ్స్ వేదికగా జరిగిన మొదటి టెస్టులో ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ 103 పరుగులతో గెలిచినప్పటికీ అతడికి తుది జట్టులో చోటు లభించలేదు. లార్డ్స్ వేదికగా గురువారం నుంచి రెండో టెస్ట్ ప్రారంభం కానున్న సమయంలో ఈ నైట్‌క్లబ్ వివాదం బయటపడటం జట్టు మేనేజ్‌మెంట్‌కు పెద్ద తలనొప్పిగా మారిందనడంలో సందేహం లేదు. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా టూర్లలో హ్యారీ బ్రూక్, బెన్ స్టోక్స్, గస్ అట్కిన్సన్ వంటి ప్లేయర్లు నైట్‌క్లబ్ వివాదాల్లో చిక్కుకోవడంతో గతంలో రాత్రిపూట కర్ఫ్యూ నిబంధనను అమలు చేశారు. అయితే బెన్ స్టోక్స్ రిటైర్మెంట్ తర్వాత టెస్ట్ కెప్టెన్సీని మళ్లీ చేపట్టిన జో రూట్ ఇటీవల కర్ఫ్యూ నిబంధనలను సులభతరం చేశాడు. “ప్లేయర్లు అందరూ ఎదిగిన వ్యక్తులు, మైదానం వెలుపల బాధ్యతాయుతంగా ఎలా ప్రవర్తించాలో వారికి తెలుసు” అని రూట్ చెప్పిన కొద్ది రోజులకే బ్రైడన్ కార్స్ పోలీసులకు దొరికిపోవడం జట్టు క్రమశిక్షణపై అంతా వేలెత్తి చూపిస్తున్నారు.